సమావేశము – VIII
వాల్యూము – 1
నెం. 5

వెల : రూ. 16–00
2 నవంబరు, 2017
గురువారం,
(శక సం. 1939,
కార్తీక – 13)

# తెలంగాణ శాసన పరిషత్తు కార్యకలాపాలు

## అధికార నివేదిక

విషయ సూచిక

I. ప్రశ్నోత్తరాలు ... 1

II. సభా కార్యక్రమం : ... 18

1. వాయిదా తీర్మాన తిరస్కరణ
2. ప్రత్యేక ప్రస్తావనలు

# తెలంగాణ శాసన పరిషత్తు

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| ఛైర్మన్ | : | శ్రీ కె. స్వామిగౌడ్ |
| డెప్యూటీ ఛైర్మన్ | : | శ్రీ నేతి విద్యాసాగర్ |
| కార్యదర్శి | : | డా. వి. నరసింహాచార్యులు |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ ఎస్. దుర్గాప్రసాద్ |
| | | శ్రీ సి.హెచ్. ఉపేందర్ రెడ్డి |
| | | శ్రీమతి వి.ఎస్. ప్రసన్నకుమారి |
| | | శ్రీ బి. కమలాకర్ |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీమతి యస్. నాగమణి |

# తెలంగాణ శాసన పరిషత్తు కార్యకలాపాలు

## అధికార నివేదిక

## (ఎనిమిదవ సమావేశము - ఐదవ రోజు)

## గురువారం, నవంబరు 02, 2017

(సభ ఉదయం 10.00 గంటలకు ప్రారంభమైనది)

(గౌరవ ఛైర్మన్ అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

**మిస్టర్ ఛైర్మన్:** సభకు నమస్కారం. ఇప్పుడు క్వశ్చన్ అవర్. క్వశ్చన్ నెం. 2291..

### I. ప్రశ్నోత్తరాలు

### రాష్ట్రంలో ఆర్‌యుబి మరియు ఆర్‌ఓబి ల నిర్మాణం

ప్రశ్న నెం.2291(41)

శ్రీ బోడకుంటి వెంకటేశ్వర్లు, డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి, డా. మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎంఎల్‌సి లు:- గౌరవ రహదార్లు మరియు భవనాల శాఖా మంత్రి గారు దయచేసి ఈ క్రింది విషయాలు తెలిపెదరా:

(అ) రాష్ట్రంలోని అనేక రైల్వే లెవెల్ క్రాసింగ్‌ల వద్ద ఆర్‌యుబి మరియు ఆర్‌ఓబి ల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదన వివరములు;

(ఆ) ప్రతిపాదిత ఆర్‌యుబి మరియు ఆర్‌ఓబిల అంచనా వ్యయం మరియు పురోగతిలో ఉన్న పనుల వివరములు;

(ఇ) ఎన్‌హెచ్ 163పై, ఖాజీపేట వద్ద రెండవ ఆర్‌ఓబి మంజూరైన విషయం వాస్తవమేనా;

(ఈ) అయినచో, ఆ వివరములు ఏమి?

రహదార్లు మరియు భవనాల శాఖామంత్రి (శ్రీ తుమ్మల నాగేశ్వరరావు) :- (అ) రైల్వే పనుల కార్యక్రమం/ డిపాజిట్ పనుల క్రింద చేర్చిన ఆర్‌ఓబిలు/ఆర్‌యుబిలు 48, అందులో 21 పనులకు ప్రభుత్వం మంజూరునిచ్చింది. వివరాలను అనుబంధం-1 రూపంలో సభా సమక్షంలో ఉంచడమయింది.

LCQ No.2291 - Annexure-I

ROB's/RUB's Works in Progress

| Sl. No | District | L.C No | Location | Rs. in Lakhs |
|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 |
| A | Works in Progress | | | |
| 1 | KomarambeemAsifabad | 80 | Sirpur | 3003 |
| 2 | Khammam | 106 | Dhamasalapuram | 7700 |
| 3 | Warangal Urban | RUB @ VenkataramanaTheater | Br.482 | 780 |
| 4 | Warangal Urban | At km 0/0 of Kadipikonda Warangal road (Deposit work) | Link road | 5000 |
| 5 | Warangal Urban | Additional ROB @ Fathimanagar in Kazipet (Deposit work) | NH-163 | 7800 |
| 6 | Mahabubabad | 71 | Nekkonda RUB | 740 |
| 7 | Karimnagar | 24 | Bijigiri Sharif | 5000 |
| 8 | Peddapalli | 51 | Ramagundam | 2300 |
| 9 | Gadwal | 99T | Gadwal | 2500 |
| 10 | YadadriBhongiri | 22 | BibiNagar | 1900 |
| 11 | YadadriBhongiri | 28 | Bhongir | 2400 |
| 12 | YadadriBhongiri | 37 | RUB @ Alair | 650 |
| 13 | Medchal | 15 | GhatKesar | 3900 |
| 14 | Rangareddy | 20 | ShankarPally | 2900 |
| 15 | Rangareddy | 21 | NagulaPally | 3600 |
| 16 | Medchal | BP 11 | Anandhbagh | 2700 |
| 17 | Medchal | BP 8 | Vajpeyanagar | 3250 |
| 18 | Medchal | 12 | Charlapally | 3450 |
| 19 | Mancherial | Deposit work (SCCL) | IndaramKundaram | 1850 |
| 20 | Nizamabad | Deposit work (RLY's) | Br 771 & Br 773 on ArmoorBheemgal road and Old NH road | 2550 |
| 20 | Nizamabad | Deposit work (RLY's) | Br 771 & Br 773 on ArmoorBheemgal road and Old NH road | 2550 |
| 21 | Nizamabad | Deposit work | RUB @ Vijayatalkies | 2000 |
| | Total 21 works | | (A) Total = Rs . 65973 Lakhs | |

| B | Works in alignment and estimate stage | | | |
|---|---|---|---|---|
| 1 | Mancherial | 57 | Ravidrakhani | 3211 |
| 2 | Adilabad | 30 | Adilabad Yard | 7670 |
| 3 | YadadriBhongir | 33 | Wangapalli | 3201 |
| 4 | Nizamabad | 193 | Madhavaram | 4407 |
| 5 | Rangareddy | 13 | Tandur Yard | 5175 |
| 6 | Medchal | 246/A (4-Lane) | Gundlapochampally | 9279 |
| 7 | Janagoan | 44 | Raghunathapally | 3180 |
| 8 | Warangal Rural | 67 | Ookai-Torruru | 5279 |
| 9 | Mahabubabad | 80 | Mahabubabad | 5845 |
| 10 | Mahabubabad | 90 | Garla | 5782 |
| 11 | Warangal Urban | 60 | NIT | 5529 |
| 12 | Warangal Urban | 1 | Muncipal Filter Beds | 4493 |
| 13 | Warangal Rural | 64 | Dharmaram | 5245 |
| 14 | Warangal Urban | 54 | Nashkal | 4727 |
| 15 | Warangal Urban | 14 | Uppal | 5364 |
| 16 | Peddapally | 39 | Peddapally | 7751 |
| 17 | Peddapally | 49 | Ramagundam | 7475 |
| 18 | Peddapally | 31 | Kolanur road | 7239 |
| 19 | Peddapally | 34 | Sultanabad | 7217 |
| 20 | Peddapally | 28 | PR road | 7217 |
| 21 | Peddapally | 29 | PR road | 7112 |
| 22 | Peddapally | 40 | Goureddipeta | 9301 |
| 23 | Peddapally | 32 | kolanur road | 7217 |
| 24 | Khammam | 129 | Jamelapuram | 7418 |
| 25 | Khammam | 113 | PR road | 7790 |
| 26 | Khammam | 107 | PR road | 7475 |
| 27 | Khammam | 120 | PR road | 7217 |
| | Total 27 works | | (B) Total =Rs .168816 Lakhs | |
| | Grand Total - 21 +27 =48 works | | Grand Total (A+B) Rs. 234789 Lakhs | |

(ఆ) ప్రతిపాదిత 27 ఆర్ఓబిలు/ఆర్‌యుబిల అంచనా వ్యయం రూ.168816లక్షలు. పురోగతిలో ఉన్న 21 పనుల అంచనా వ్యయం రూ.65973లక్షలు. వివరాలను అనుబంధం-2 మరియు 3 రూపంలో సభా సమక్షంలో ఉంచడమయింది.

| | Annexure-II | | | |
|---|---|---|---|---|
| | ROB's/RUB's Works in Progress | | | |
| Sl. No | District | L.C No | Location | Amount in Lakhs |
| 1 | 2 | 3 | 4 | 5 |
| 1 | Komarambeem Asifabad | 80 | Sirpur | 3003 |
| 2 | Khammam | 106 | Dhamasalapuram | 7700 |
| 3 | Warangal Urban | RUB @ Venkataramana Theater | Br.482 | 780 |
| 4 | Warangal Urban | At km 0/0 of Kadipikonda Warangal road (Deposit work) | Link road | 5000 |
| 5 | Warangal Urban | Additional ROB @ Fathimanagar in Kazipet (Deposit work) | NH-163 | 7800 |
| 6 | Mahabubabad | 71 | Nekkonda RUB | 740 |
| 7 | Karimnagar | 24 | Bisgursharif | 5000 |
| 8 | Peddapalli | 51 | Ramagundam | 2300 |
| 9 | Gadwal | 99T | Gadwal | 2500 |
| 10 | Yadadri Bhongiri | 22 | BibiNagar | 1900 |
| 11 | Yadadri Bhongiri | 28 | Bhongir | 2400 |
| 12 | Yadadri Bhongiri | 37 | RUB @ Alair | 650 |
| 13 | Medchal | 15 | GhatKesar | 3900 |
| 14 | Rangareddy | 20 | ShankarPally | 2900 |
| 15 | Rangareddy | 21 | NagulaPally | 3600 |
| 16 | Medchal | BP 11 | Anandhbagh | 2700 |
| 17 | Medchal | BP 8 | Vajpeyanagar | 3250 |
| 18 | Medchal | 12 | Charlapally | 3450 |
| 19 | Mancherial | Deposit work (SCCL) | Indaram Kundaram | 1850 |
| 20 | Nizamabad | Deposit work (RLY's) | Br 771 & Br 773 on Armoor Bheemgal road and Old NH road | 2550 |
| 21 | Nizamabad | Deposit work | RUB @ Vijayatalkies | 2000 |
| | | | | Total= Rs. 65973 LAKHS |

| Annexure-III | | | | | |
|---|---|---|---|---|---|
| Status of ROB/RUB's approved in Railway Works programme in Alignment / Estimate stage | | | | | |
| | | | | | |
| Si.No | District | Location | LC No | RWP | Cost approved in RWP |
| 1 | | 2 | 3 | 4 | |
| 1 | Mancherial | Ravidrakhani | 57 | 2012-13 | 3211 |
| 2 | Adilabad | Adilabad Yard | 30 | 2016-17 | 7670 |
| 3 | Yadadri Bhongir | Wangapalli | 33 | 2012-13 | 3201 |
| 4 | Nizamabad | Madhavaram | 193 | 2012-13 | 4407 |
| 5 | Rangareddy | Tandur Yard | 13 | 2016-17 | 5175 |
| 6 | Medchal | Gundlapochampally | 246/A (4-Lane) | 2017-18 | 9279 |
| 7 | Janagoan | Raghunathapally | 44 | 2012-13 | 3180 |
| 8 | Warangal Rural | Ookai-Torruru | 67 | 2015-16 | 5279 |
| 9 | Mahabubabad | Mahabubabad | 80 | 2015-16 | 5845 |
| 10 | Mahabubabad | Garla | 90 | 2015-16 | 5782 |
| 11 | Warangal Urban | NIT | 60 | 2015-16 | 5529 |
| 12 | Warangal Urban | Muncipal Filter Beds | 1 | 2015-16 | 4493 |
| 13 | Warangal Rural | Dharmaram | 64 | 2015-16 | 5245 |
| 14 | Warangal Urban | Nashkal | 54 | 2015-16 | 4727 |
| 15 | Warangal Urban | Uppal | 14 | 2015-16 | 5364 |
| 16 | Peddapally | Peddapally | 39 | 2016-17 | 7751 |
| 17 | Peddapally | Ramagundam | 49 | 2017-18 | 7475 |
| 18 | Peddapally | Kolanur road | 31 | 2017-18 | 7239 |
| 19 | Peddapally | Sultanabad | 34 | 2017-18 | 7217 |
| 20 | Peddapally | PR road | 28 | 2017-18 | 7217 |
| 21 | Peddapally | PR road | 29 | 2017-18 | 7112 |
| 22 | Peddapally | Goureddipeta | 40 | 2017-18 | 9301 |
| 23 | Peddapally | kolanur road | 32 | 2017-18 | 7217 |
| 24 | Khammam | Jamelapuram | 129 | 2017-18 | 7418 |
| 25 | Khammam | PR road | 113 | 2017-18 | 7790 |
| 26 | Khammam | PR road | 107 | 2017-18 | 7475 |
| 27 | Khammam | PR road | 120 | 2017-18 | 7217 |
| | | | | Total = Rs.168816 Lakhs | |

(ఇ) అవునండీ.

(ఈ) వరంగల్ జిల్లాలోని ఎన్‌హెచ్-163పై 133/4 కి.మీ నుండి 134/2 కి.మీ వరకు హనుమకొండ – కాజీపేట మధ్య, కాజీపేట–బల్లార్ష విభాగంలో 365/3133 రైల్వే కి.మీ వద్ద 2వ ఆర్‌ఓబి నిర్మాణం పని నిమిత్తం రూ.78.00 కోట్ల మొత్తానికి పరిపాలక మంజూరును ఇవ్వడమైంది.

**శ్రీ బోడకుంటి వెంకటేశ్వర్లు (శాసనసభ నియోజకవర్గం):-** అధ్యక్షా, మేము అడిగిన ప్రశ్నలకు గౌరవ మంత్రివర్యులు శ్రీ తుమ్మల నాగేశ్వరరావు గారు చాలా వివరంగా సమాధానం చెప్పారు, సంబంధిత సమాచారంతో అనెక్జర్స్ కూడా ఇచ్చారు. అందుకు వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. వరంగల్‌లో ఎంతో ప్రతిష్టాత్మకమైన ఫాతిమా ఫ్లైఓవర్ శాంక్షన్ అయింది. గౌరవ డిప్యూటీ సియం శ్రీహరి గారు – గౌరవ ముఖ్యమంత్రిగారు, ఆర్ అండ్ బి మినిస్టర్ గారిని రిక్వెస్టు చేసి దాన్ని శాంక్షన్ చేయించారు. అందుకు వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. మొన్న గౌరవ ముఖ్యమంత్రిగారు వరంగల్‌కి వచ్చినపుడు దాన్ని శంఖుస్థాపన చేయడం జరిగింది.

అధ్యక్షా, ప్రధానంగా మా జనగాం నియోజకవర్గం, జనగాం మండల్‌లో పెంబర్తి నుంచి ఎల్లంల వరకు ఆర్‌ఓబి అవసరం ఉంది. దాన్ని చేపట్టవలసిందిగా మంత్రిగారిని రిక్వెస్టు చేస్తున్నాను.

**డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి (పట్టభద్రుల నియోజకవర్గం – వరంగల్, ఖమ్మం మరియు నల్గొండ):-** అధ్యక్షా, ఈ ప్రశ్న వరకు సమాధానం సంతృప్తి కరంగా ఉంది. అయితే హైదరాబాదు – వరంగల్ రోడ్డును నాలుగు లేన్ల రోడ్డు చేయడానికి సంబంధించి వర్క్ జరుగుతోంది. ఇది చాలా నత్త నడక నడుస్తున్నట్లుగా ఉంది. ప్రస్తుతం ఉన్న రోడ్డు పూర్తిగా కరాబైంది. గత మూడు మాసాల నుంచి కురుస్తున్న వానల మూలంగా ఆ రోడ్డు మీద కనీసం వాహనాలు పోయే పరిస్థితి లేదు. ఈ ప్రశ్నకు అనుబంధ ప్రశ్న కాకపోయినా, సందర్భం వచ్చింది కాబట్టి, ఆర్ అండ్ బి మినిస్టర్ గారు సమాధానం చెబుతున్నారు కాబట్టి అడుగుతున్నాను. ఈ నాలుగు లేన్ల వర్క్ వేగం పెంచుతూ, ప్రస్తుతం చెడిపోయిన రోడ్డుకు అర్జంటుగా మరమ్మత్తులు చేయించవలసిందిగా మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**డా. మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి (నామినేటెడ్):-** అధ్యక్షా, వరంగల్‌లో కాజీపేట దగ్గర ఆర్‌ఓబి శాంక్షన్ చేసినందుకు గౌరవ ముఖ్యమంత్రిగారికి, గౌరవ ఉప ముఖ్యమంత్రిగారికి, గౌరవ ఆర్ అండ్ బి మినిస్టర్ గారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఆర్‌ఓబి లేదా ఆర్‌యుబి కట్టే ముఖ్యోద్దేశం ఏమంటే – అక్కడ లెవెల్ క్రాసింగ్ ఉండకూడదని. Manned/Unmanned తో సంబంధం లేకుండా ఎట్టి పరిస్థితుల్లో లెవెల్ క్రాసింగ్ ఉండకూడదు. లెవెల్

క్రాసింగ్ లేకపోతే naturally, efficiency of the railways will be increased. రోడ్డు ట్రాన్స్‌పోర్టేషన్ కూడా సాఫీగా జరిగిపోయే అవకాశం ఉంది. యాక్సిడెంట్స్ తగ్గిపోతాయి.

వరంగల్‌లో హంటర్ రోడ్డు దగ్గర చిన్న రైల్వే అండర్ బ్రిడ్జ్ ఉంది. అక్కడ చిన్న వెహికిల్ కూడా పోదు. ఆర్‌యుబి కట్టినపుడు ఫుల్ హైట్‌తో కడితే పెద్ద వెహికిల్స్ కాకపోయినా చిన్న వెహికిల్స్ పోయే అవకాశం ఉంటుంది. ఎక్కడైనా భవిష్యత్తులో ఆర్‌యుబి లు కడితే, ఫుల్ హైట్‌తో కట్టాలని మంత్రిగారికి విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ మధ్య మన గవర్నమెంటు వచ్చిన తర్వాతే మెదక్ జిల్లా, మాసాయిపేట వద్ద రైల్వే యాక్సిడెంట్ అయింది. లెవెల్ క్రాసింగ్ దగ్గర అది జరిగింది. ఈ లెవెల్ క్రాసింగ్‌ల వల్ల ప్రాణ నష్టంతోబాటు చాలా ఆస్తి నష్టం కూడా జరుగుతోంది. ఆర్‌యుబిలు గానీ, ఆర్‌ఓబిలు కానీ కట్టినపుడు ఈ చిన్న చిన్న precautions తీసుకుంటే బాగుంటుందని మనవి చేస్తున్నాను.

**శ్రీ ఉల్లోళ్ల గంగాధర్ గౌడ్ (శాసనసభ నియోజకవర్గం):-** అధ్యక్షా, గతంలో నిజామాబాదులో ఒక బైపాస్ రోడ్డు నిర్మాణం జరిగింది. అది మాధవనగర్ నుంచి బోధన్ వైపు పోయే బైపాస్ రోడ్డు. అది నిజామాబాదు మీదుగా వెళుతోంది. దానికి ఆర్‌ఓబి లేక ఇబ్బంది కలుగుతోంది. అరసపల్లి వరకే ఆరోడ్డు ఆగిపోయింది. అరసపల్లి చిన్న గ్రామం, ఆ గ్రామం గుండా లారీలు, ఇతర వాహనాలు వెళుతున్నందున ఆ గ్రామస్తులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అక్కడ వెంటనే ఆర్‌ఓబి నిర్మాణం చేస్తే డైరెక్టుగా బోధన్‌కి, హైవేకి వెళ్లడానికి వీలవుతుంది. కాబట్టి అక్కడ ఆర్‌ఓబి మంజూరు చేసే ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉందా? చెప్పాలని మంత్రిగారిని కోరుతున్నాను.

**డా.ఆర్. భూపతిరెడ్డి (స్థానిక సంస్థలు – నిజామాబాద్):-** అధ్యక్షా, డిచ్‌పల్లి టు నిజామాబాద్ రోడ్డు, అది హైదరాబాదు మెయిన్ రోడ్డు. మనకు అది చాలా ఈజీ రూట్. అక్కడ లెవెల్ క్రాసింగ్ ఉంది. నిజామాబాదు టు హైదరాబాదు డెయిలీ గూడ్స్ రైళ్లతో సహా మొత్తం 40 రైళ్లు నడుస్తాయి. అక్కడ ఉన్న లెవెల్ క్రాసింగ్‌లో ప్రతి 15, 20 నిమిషాలకు ఒకసారి గేటు పడుతుంది. 20 నిమిషాల పాటు ట్రాఫిక్ జామ్ అవుతోంది. అక్కడ ఇదివరకే రైల్వే ఫ్లైఓవర్ శాంక్షన్ అయింది. దాని పరిస్థితి ఏమిటి, ఎప్పటి వరకు దాన్ని పూర్తి చేస్తారో చెప్పాలని కోరుతున్నాను.

**శ్రీ తుమ్మల నాగేశ్వరరావు:-** అధ్యక్షా, వెంకటేశ్వర్లు గారు పెంబర్తి నుంచి ఎల్లంల కు ఆర్‌ఓబి కావాలని అడిగారు. అది పరిశీలనలో ఉంది, తప్పకుండా భవిష్యత్తు కార్యక్రమాలలో దాన్ని ఇన్‌క్లూడ్ చేయడం జరుగుతుంది. రాజేశ్వర్‌రెడ్డిగారు రైల్వేస్ గురించి అడగమంటే రోడ్ల గురించి అడుగుతున్నారు. వారు ప్రస్తావించిన విషయంపై గౌరవ ఉప ముఖ్యమంత్రిగారిని రిక్వెస్టు చేశాం. నాలుగు లేన్ల పనులను టేకప్ చేసిన ఏజన్సీకే ఆ రోడ్డు నిర్వహణ బాధ్యత ఉంటుంది. రాయగిరి నుంచి వరంగల్ వరకు నాలుగు లేన్ల పనులు జరుగుతున్నాయి. ఆ పనులు జరుగుతున్నపుడు ఉన్న రోడ్డు నిర్వహణను చూసుకోవలసిన బాధ్యత ఏజన్సీకి ఉంటుంది. అందుకే ఆ జిల్లాకు చెందిన డెప్యూటీ సియం గారిని కోరాం. ఆ విషయాన్ని రెవ్యూ చేసి, అవసరమైతే ఏజన్సీని పిలిపించి ఆ కార్యక్రమాలను నిర్వహించమని అడుగుతున్నాం.

శ్రీనివాసరెడ్డిగారు manned and unmanned level crossing ల గురించి అడిగారు. రాష్ట్రంలో మొత్తం 582 లెవెల్ క్రాసింగులున్నాయి. అందులో 397 manned, 185 unmanned level crossing లున్నాయి. రైల్వేస్‌ను కూడా మేము రిక్వెస్టు చేస్తున్నాం. Unmanned level crossing లేమీ ఉండకూడదు. ఎటువంటి పరిస్థితుల్లో యాక్సిడెంట్లు జరగకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యం. దానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొచ్చి చర్యలు తీసుకోవాలని చెబుతున్నాం.

వరంగల్‌లో హంటర్ రోడ్డులో ఉన్న ఆర్‌ఓబి గురించి చెప్పారు. దాన్ని కూడా పరిశీలించి చర్యలు తీసుకుంటాం. నిజామాబాదు బైపాసు లెవెల్ క్రాసింగు గురించి గంగాధర్ గౌడ్ గారు అడిగారు. అది ప్రభుత్వ పరిశీలనలో ఉంది. భూపతిరెడ్డి గారు డిచ్‌పల్లి – నిజామాబాదు లెవెల్ క్రాసింగ్ గురించి అడిగారు. దాన్ని కూడా పరిశీలిస్తామని గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

**శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి (శాసనసభ నియోజకవర్గం):-** అధ్యక్షా, గౌరవ మంత్రిగారికి కూడా తెలుసు, ఖమ్మం పట్టణంలో ధ్వంసలాపురం దగ్గర విపరీతమైన ట్రాఫిక్ జామ్ ఉంది. ఎప్పటికప్పుడు అక్కడ రైల్వే క్రాసింగ్ దగ్గర గేటు పడుతుంది. అక్కడ ఆర్‌ఓబి నిర్మాణం ప్రభుత్వ పరిశీలనలో ఉందా? 500 పైన లెవెల్ క్రాసింగులున్న నేపథ్యంలో ఒక మెకానిజాన్ని ఎవాల్వ్ చేయవలసిన అవసరం ప్రభుత్వానికి ఉంది. ఎందుకంటే ఈ విషయం రైల్వేస్ మరియు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉన్నది. తప్పకుండా ఒక మానిటరింగ్ మెకానిజాన్ని ఏర్పాటు చేసి రెండు, మూడు నెలలకు ఒకసారి సమీక్షిస్తే బాగుంటుంది. దీనికి సంబంధించి

ఒక ఎస్టాబ్లిష్‌మెంటు ఏర్పాటు చేస్తే అఫీషియల్‌గా ఉంటుంది, జవాబుదారీతనంతో పని చేసే అవకాశం ఉంటుంది. ట్రాన్స్‌పోర్టు, ఆర్ అండ్ బి, అవసరమైతే పోలీసు శాఖతో కూడా సమన్వయం చేసుకొని ఒక టాస్క్‌ఫోర్స్‌ని ఏర్పాటు చేస్తే ఇలాంటివి నివారించడానికి అవకాశం ఉంటుంది. చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి కాబట్టి ఖమ్మం పట్టణం, ధ్వంసలాపురం దగ్గర ఏదైనా ఆర్‌ఓబి నిర్మాణానికి అవకాశం ఉందా? దయచేసి చెప్పాలని మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ తుమ్మల నాగేశ్వరరావు:–** అధ్యక్షా, సుధాకర్ రెడ్డిగారు ధ్వంసలాపురం ఆర్‌ఓబి గురించి అడిగారు. రూ.77కోట్లతో దాన్ని శాంక్షన్ చేయడం జరిగింది. మొన్న మున్సిపల్ శాఖామంత్రిగారు అక్కడికి వచ్చినపుడు దానికి శంఖుస్థాపన కూడా చేయడం జరిగింది. Manned and unmanned level crossing లు, రైల్వే సేఫ్టీ వర్క్సకి సంబంధించి మొన్ననే కేబినెట్‌లో ఒక నిర్ణయం తీసుకున్నాం. దీని మీద ఒక సబ్‌కమిటీ వేశాం. రెండు, మూడు రోజుల్లో ఆ కమిటీ సమావేశాన్ని నిర్వహించి, అటువంటి ప్రమాదాలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

**నూతన ఆధార్ కార్డుల కేంద్రాల ఏర్పాటు**

ప్రశ్న నెం.2418(42)

శ్రీ ఫారూఖ్ హుస్సేన్, ఎం.ఎల్.సి.:– గౌరవ సమాచార సాంకేతిక శాఖామంత్రి దయచేసి ఈక్రింది విషయములు తెలిపెదరా:

(అ) రాష్ట్రంలో ప్రస్తుతం పని చేస్తున్న ఆధార్ కార్డు కేంద్రాల సంఖ్య;

(ఆ) ఆ కేంద్రాల ద్వారా ఆధార్ కార్డులను పొందిన పౌరుల సంఖ్య;

(ఇ) నూతనంగా ఏర్పడిన జిల్లాలో ఆధార్ కార్డు కేంద్రాలను ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉన్నదా;

(ఈ) అయినచో, ఎప్పటిలోగా వాటిని ఏర్పాటు చేస్తారు?

సమాచార సాంకేతిక శాఖామంత్రి (శ్రీ కె. తారక రామా రావు) :– (అ) తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 709 ఆధార్ కేంద్రాలు పని చేస్తున్నాయి.

(ఆ) ఈ కేంద్రాల ద్వారా ఆధార్ కార్డులను పొందిన పౌరుల సంఖ్య 3,83,95,934.

(ఇ) యుఐడిఏఐ(భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ) నుండి అందిన మార్గదర్శకాల ప్రకారం, రాష్ట్రప్రభుత్వం ఆధార్ కేంద్రాలన్నింటినీ నియంత్రించాలని పేర్కొనడ మయింది. తదనుసారంగా, ప్రస్తుతమున్న ఆధార్ కేంద్రాల తిరిగి పంపిణీ లేదా అవసరమైతే ఆధార్ నూతన కేంద్రాలను మంజూరు చేయడం ద్వారా 30.9.2017 తేదీ నాటికి ప్రతి మండలంలో 3 ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాలనే అభ్యర్థనతో ఐటి అండ్ సి శాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి 21.8.2017 తేదీన జిల్లా కలెక్టర్లందరికీ అవసరమైన ఆదేశాలను జారీ చేయడమైంది. ప్రస్తుతమున్న ప్రైవేటు ఆధార్ కేంద్రాలను ప్రభుత్వ ప్రాంగణాలకు మార్చాలని వారిని ఆదేశించడమైంది. 24.10.2017 తేదీ గల మరో రిమైండర్ లేఖ ద్వారా ఈఎస్‌డి(మీసేవ) కమిషనర్ పై విషయాలను ఉటంకిస్తూ కలెక్టర్లందరికీ తెలియజేయడమైంది. 31.10.2017 తేదీకల్లా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని కోరడమైంది.

(ఈ) కలెక్టర్లు తీసుకున్న కార్యాచరణను సమీక్షించి త్వరలోనే పూర్తి చేయడమవుతుంది.

**శ్రీ ఫారూఖ్ హుస్సేన్ (నామినేటెడ్):–** అధ్యక్షా, తెలంగాణ రాష్ట్రంలో కొత్త జిల్లాలు ఏర్పాటయ్యాయి. ప్రభుత్వానికి మంచి పేరు వచ్చింది. టిఆర్‌యస్ ప్రభుత్వం మంచి పని చేస్తోంది. జిల్లాల ప్రజలందరికీ పాలన పూర్తిగా అందుబాటులోకి వచ్చింది. అయితే కొన్ని ఆధార్ కేంద్రాలు పని చేయడం లేదు. ఆవిధంగా పని చేయని వాటి స్థానంలో కొత్త కేంద్రాలను ఏర్పాటు చేయాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉందా? కొత్త జిల్లాల్లో వాటి సంఖ్యను పెంచే ఆలోచన ఏదైనా ఉందా?

**శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి:–** అధ్యక్షా, కేంద్ర ప్రభుత్వం ఇటీవల అనేక స్కీములకు ఆధార్‌ని లింక్ చేయడం జరిగింది. దీని మీద సుప్రీంకోర్టులో అనేక అబ్జర్వేషన్స్ వచ్చాయి. అది వాళ్ల ఛాయిస్‌కే వదలేయాలని కోర్టు సూచించినప్పటికీ, కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాలకు, ముఖ్యంగా ప్రభుత్వ పథకాల వల్ల లబ్ధి పొందుతున్న బలహీన వర్గాలకు ఆధార్ తప్పనిసరి చేసిన పరిస్థితి ఉందా? మీరు చెబుతున్న దాని ప్రకారం రాష్ట్రంలో మూడు కోట్లకు పైగా ప్రజలకు ఆధార్ ఉన్న నేపథ్యంలో, ఇంత పెద్ద రేషన్ వ్యవస్థ ఉన్న నేపథ్యంలో, ప్రతిదీ ఆధార్‌కి లింకు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వ ఇన్ ప్రిన్సిపుల్ పాలసీ స్టాండ్ ఏమిటి? మీరు కేంద్ర ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా

చేస్తున్నారా? వెస్ట్ బెంగాల్ ముఖ్యమంత్రి ఇటీవల ఆధార్‌కు సంబంధించి అబ్జెక్షన్ తెలియజేశారు, దీని వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని కోర్టుకు కూడా పోవడం జరిగింది. అది వేరే సంగతి. ప్రభుత్వం ముందున్న ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో ఈ ఆధార్‌పై అవగాహన ఏర్పరచడానికి, అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడానికి ముందస్తు ప్రణాళిక ఏమైనా ఉందా? తెలియజేయాలని మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ కె. తారక రామారావు:-** అధ్యక్షా, గౌరవ సభ్యులు ఫారూఖ్ హుస్సేన్ గారు అడిగిన విషయంపై చెబుతున్నాను. రాష్ట్రంలో ఇప్పటికే 709 ఆధార్ కేంద్రాలు పని చేస్తున్నాయి. వాటి ద్వారా 3.80కోట్ల మందికి మనం ఆధార్ కార్డులను అందించడం జరిగింది. కాబట్టి కొత్తగా కేంద్రాలను ఏర్పాటు చేయాలనే ఆలోచన ప్రభుత్వానికి ప్రస్తుతానికైతే లేదు. ఎందుకంటే ఇప్పటికే నూరు శాతం ఆధార్ ఎన్‌రోల్‌మెంటు పూర్తి చేసి ఉన్నాం. కాబట్టి కొత్తగా చేయవలసిన అవసరమైతే లేదు.

గౌరవ సభ్యులు సుధాకర్ రెడ్డి గారు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ స్కీముకి ఆధార్ లింకు చేయడం గురించి అడిగారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ స్కీము – అంటే ప్రభుత్వం నుంచి అందే సంక్షేమ ఫలాలను నేరుగా లబ్ధిదారునికి బదిలీ చేయడం జరుగుతుంది. ఉదాహరణకు, భారతదేశంలో ఏ రాష్ట్రంలో చేయనంత పెద్ద మొత్తంలో పెన్షన్లు ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ. ఇలాంటి చాలా స్కీములకు ఆధార్‌ని లింకు చేసి, తద్వారా అర్హులకే ఫలాలు అందేలా కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు ఏవైతే ఉన్నాయో వాటిని విధిగా పాటిస్తున్నాం. భవిష్యత్తులో మన కార్యక్రమాలలో ఇంకా సమీక్షించుకొని, ప్రజాధనం వృథా గాకుండా చేసి, అనర్హులకు ఫలాలు అందకుండా చేసే కార్యక్రమంలో తప్పకుండా కేంద్ర ప్రభుత్వగైడ్‌లైన్స్‌తోబాటు మనంతట మనమే కొన్ని నిర్ణయాలు తీసుకుంటాం. ఉదాహరణకు గౌరవ ముఖ్యమంత్రిగారు మొన్న ఒక కార్యక్రమాన్ని సమీక్షిస్తున్నారు. రేషన్ షాపుల విషయంలో కూడా పెద్ద మొత్తంలో డబ్బులు వృథా అవుతున్నాయి, దాన్ని ఏవిధంగా నియంత్రించాలో ఆలోచిస్తున్నారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ తదితర వాటన్నింటిలో కూడా ఈ ఆధార్ కీలకం కాబోతోంది. గౌరవ సభ్యులు విలువైన సూచనలు ఇచ్చినట్లయితే తప్పకుండా ప్రభుత్వం వాటిని పరిగణనలోకి తీసుకుంటుంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలకు లోబడి వాటికి అదనంగా ఇతర సమీక్షలు, సవరణలు చేసి, మనం ముందుకు పోవడానికి అవకాశముంటే ఆవిధంగా చేస్తామని తెలియజేస్తున్నాను.

**శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి:-** అధ్యక్షా, అఖిలపక్షాన్ని మంత్రిగారి ఛాంబర్‌లోకి పిలిస్తే అనేక గ్రౌండ్ రియాలిటీస్‌ను వారి దృష్టికి తీసుకొస్తాం. అల్టిమేట్‌గా ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండాలన్నదే నా ప్రస్తావన. గౌరవ మంత్రిగారు అఖిలపక్షాన్ని తన ఛాంబర్‌లోకి పిలిచి అందరి అభిప్రాయాన్ని తీసుకోవడంలో తప్పు లేదు. మన సిస్టంకు అనుకూలంగా, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలను డీవియేట్ చేయకుండా ఏమేమి మార్గాలున్నాయో చర్చించవచ్చు, మంచి సూచనలు చేస్తాం. Ultimately, it should be beneficial to the beneficiary.

**మిస్టర్ ఛైర్మన్:-** ప్రశ్న నెం.2374.. సంబంధిత శాఖామంత్రి ప్రక్క నియోజకవర్గానికి వెళ్లారు. చివర్లో ఈ ప్రశ్నను తీసుకోవడం జరుగుతుంది.

## ఎం.బి.సి. సంస్థ ఏర్పాటు

ప్రశ్న నెం. 2274(44)

శ్రీ యన్. రామచంద్రరావు,ఎం.ఎల్.సి.:- గౌరవ అటవీ మరియు బిసి సంక్షేమ శాఖల మంత్రి దయచేసి ఈ క్రింది విషయములు తెలిపెదరా:

(అ) రాష్ట్రంలో అత్యంత వెనకబడిన తరగతుల సంస్థను ఏర్పాటు చేసిన విషయం వాస్తవమేనా;

(ఆ) అయినచో, ఎంబిసి జాబితాలో చేర్చనున్న కులాల వివరాలు;

(ఇ) ఇప్పటి వరకు ఈ సంస్థకు చేసిన బడ్జెట్ కేటాయింపులు మరియు చేసిన వ్యయం వివరములు ఏమి?

అటవీ మరియు బిసి సంక్షేమ శాఖల మంత్రి (శ్రీ జోగు రామన్న):- (అ) అవునండీ

(ఆ) బిసిల కోసం తెలంగాణ రాష్ట్రకమిషన్‌తో సంప్రదించి ఈ విషయాన్ని పరిశీలించడమవుతుంది.

(ఇ) 2017-18 సంవత్సరానికి ప్రభుత్వం ఎంబిసి కార్పోరేషన్‌కు రూ.1000కోట్లను బడ్జెటులో కేటాయించింది.

**శ్రీ యన్. రామచంద్రరావు (పట్టభద్రుల నియోజకవర్గం - మహబూబ్‌నగర్, రంగారెడ్డి మరియు హైదరాబాద్):-** అధ్యక్షా, ఎంబిసి లను

గుర్తించడం, వారి సంక్షేమం కోసం కోట్ల రూపాయలను కేటాయించడానికి తీసుకున్న చర్యలను మేము స్వాగతిస్తున్నాం. ముఖ్యంగా గతంలో ఉమ్మడి రాష్ట్రంలో అనంతరాములు కమిషన్ ఏర్పాటు చేసి 112 బిసి కులాలను గుర్తించడం జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మీరు ఏర్పాటు చేసిన బిసి కమిషన్ రాష్ట్రంలో ఎన్ని ఎంబిసి కులాలను గుర్తించింది? మీరు ఏదైతే రూ.1000కోట్లు కేటాయించారో, ఆ మొత్తాన్ని దేనికి ఖర్చు పెడతారు, ఏ జిల్లాకు ఎంత ఖర్చు పెడతారో జిల్లాల వారీగా బ్రేకప్ ఇస్తే బాగుంటుందని మంత్రిగారిని అడుగుతున్నాను.

**శ్రీ జోగు రామన్న:–** అధ్యక్షా, 23.03.2017నాడు జీ.ఓ.నెం.7 ను జారీ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం బిసి కమిషన్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్ ఇస్తూ, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎంబిసిలను గుర్తించి ఆరు నెలల్లో రిపోర్టు ఇవ్వాలని బిసి కమిషన్‌ను కోరడం జరిగింది. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో అత్యంత వెనకబడిన కులాలను గుర్తించి వారికి న్యాయం చేయాలని, వాళ్లని ఆదుకోవాలని గౌరవ ముఖ్యమంత్రిగారు సంకల్పించారు. బిసి కమిషన్ ఎంబిసి కులాలను గుర్తించి నివేదిక ఇచ్చిన వెంటనే వాళ్లందరికీ ఆర్థిక సహాయం చేయడం జరుగుతుంది.

**మిస్టర్ చైర్మన్:–** సభ్యుల కోరిక మేరకు ప్రశ్న నెం. 2326(45)ను వాయిదా వేయడమైంది.

## ఇంటర్నెట్ బ్రాడ్ బ్యాండ్ సేవలు

ప్రశ్న నెం. 2307(46)

శ్రీ కర్నె ప్రభాకర్, ఎం.ఎల్.సి.:– గౌరవ సమాచార సాంకేతికశాఖా మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలిపెదరా:

(అ) బ్రాడ్ బ్యాండ్ సేవలను ప్రాథమిక వినియోగదారుల సేవలుగా పరిగణించాలనే ప్రతిపాదన ఏదైనా ఉన్నదా;

(ఆ) అయినచో, ఆ వివరాలు; మరియు

(ఇ) ఈ విషయంలో తీసుకున్న మరియు తీసుకుంటున్న చర్యలేమిటి?

సమాచార సాంకేతిక శాఖా మంత్రి (శ్రీ కె. తారక రామారావు):– (అ) అవునండీ. ఈ ప్రతిపాదన ప్రారంభ దశలోనే ఉన్నది. అంతర్గతంగా చర్చించడమవుతున్నది. సదరు నిబంధనలను ప్రవేశపెట్టడానికి ముందే సరైన స్టేక్‌హోల్డరును సంప్రదించడమవుతుంది.

(ఆ&ఇ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

**శ్రీ కర్నె ప్రభాకర్ (నామినేటెడ్):–** అధ్యక్షా, కొత్త రాష్ట్రంలో నూతన ఒరవడితో శాస్త్ర సాంకేతిక రంగంలో ఈ రాష్ట్రం అగ్రగామిగా ఉండాలని, ప్రాథమిక వినియోగదారుడు కూడా బ్రాడ్ బ్యాండ్ సేవలు వినియోగించుకునే పద్ధతిలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటే అనేక రకాలుగా ఉపయోగపడుతుంది. ఈరోజు నీటి బిల్లులు, కరెంటు బిల్లులు ఇంట్లో కూర్చునే కట్టే పరిస్థితి. అదే విధంగా ప్రపంచమే తన చేతిలో ఉండే పద్ధతిలో, ఏవిధమైన సమాచారమైనా తనకు అందే పద్ధతుల్లో ఈ బ్రాండ్ బ్యాండు విస్తరణ జరిగితే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది కాబట్టి దాన్ని వేగవంతం చేసి ప్రజలకు త్వరగా అందజేయడానికి చర్యలు తీసుకోవలసిందిగా మంత్రిగారిని కోరుతున్నాను.

10.20 ఉ. **శ్రీ కె. తారక రామారావు:–** అధ్యక్షా, గౌరవ సభ్యులు కర్నె ప్రభాకర్ గారు చెప్పినట్లు, తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఇంటింటికీ ఇంటర్‌నెట్/బ్రాడ్‌బ్యాండ్ అనే కార్యక్రమం భారతదేశంలోనే ఒక వినూత్నమైన కార్యక్రమం. తెలంగాణలో డ్రింకింగ్ వాటర్ గ్రిడ్ ద్వారా ఇంటింటికీ మంచినీళ్ళు ఇచ్చే కార్యక్రమం చేస్తున్నాం. దానికోసం జరిపిన త్రవ్వకాల్లో వాటర్ పైప్ లైన్‌తోపాటు, ఫైబర్ ఆప్టిక్ కేబుల్ నెట్‌వర్క్ కూడా వేయడం వల్ల ఇంటింటికీ బ్రాడ్‌బ్యాండ్ సౌకర్యం కల్పించి, తద్వారా కూడా ప్రజలకి ఆరోగ్యపరంగా, వైద్యపరంగా, విద్యాపరంగా విశేషమైన సేవలు అందించవచ్చనే ఒక బృహత్ సంకల్పంతో ప్రభుత్వం ముందుకుపోతోంది. గౌరవ సభ్యులు చేసిన సూచనలను కూడా తప్పకుండా పరిగణనలోనికి తీసుకుంటామని తమరి ద్వారా తెలియజేస్తున్నాను.

**మిస్టర్ చైర్మన్ :–** ప్రశ్న నెం.2135

## నిజామాబాద్ పట్టణాభివృద్ధి సంస్థ (ఎన్.యు.డి.ఎ.) ఏర్పాటు

ప్రశ్న నెం.2135(47)

డా. ఆర్. భూపతి రెడ్డి, ఎం.ఎల్.సి.:– గౌరవనీయులైన సమాచార, సాంకేతిక మరియు మునిసిపల్ పరిపాలన & పట్టణాభివృద్ధి శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

(అ) నిజామాబాద్ పట్టణాభివృద్ధి సంస్థ (నుడా) ఏర్పాటు చేసే ప్రతిపాదన ఏదైనా ప్రభుత్వం వద్ద ఉన్నదా;

(ఆ) ఉంటే గనక దానికి సంబంధించి వివరములు ఇవ్వగలరు; మరియు

(ఇ) ఎప్పటిలోగా అది తన కార్యవిధులు నిర్వర్తించగలదు?

సమాచార, సాంకేతిక మరియు మునిసిపల్ పరిపాలన & పట్టణాభివృద్ధి శాఖ మంత్రి (శ్రీ కె. తారక రామారావు):- (అ) అవునండీ.

(ఆ&ఇ) ప్రభుత్వం జీ.ఓ.ఎం.ఎస్.నెం.271, ఎంఏ & యుడి (ప్లానింగ్-1.2) విభాగం, తేది:24.10.2017 ద్వారా నిజామాబాద్ పట్టణాభివృద్ధి సంస్థను ఏర్పాటు చేయడం జరిగింది.

**డా. ఆర్. భూపతిరెడ్డి :-** అధ్యక్షా, చాలా రోజుల నుండి ఎదురు చూసినటువంటి నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి ఏర్పాటు చేయడానికి మన ప్రభుత్వం ముందుకు రావడం, చాలా సంతోషం. నిజామాబాద్ పట్టణంలో మూడున్నర లక్షల జనాభా ఉంటుంది. ఎడపల్లి, నవీపేట్, నిజామాబాద్ రూరల్, మోపాల, డిచ్‌పల్లి వంటి 6 మండలాల నుంచి చుట్టుప్రక్కల 61 గ్రామాలను గుర్తించారు. ఏ ప్రాతిపదికన తీసుకున్నారనే విషయమై స్పష్టత లేదు. ఈ విషయమై కలెక్టరు గారితో కూడా మాట్లాడడం జరిగింది. ప్రజా ప్రతినిధుల నుండి గానీ, స్థానిక నాయకుల నుండి గానీ కన్సెంట్ తీసుకోలేదు.

నిజామాబాద్ పట్టణానికి 25 కి.మీ.ల దూరంలో ఉన్న జూపల్లి గ్రామం ఇంక్లూడ్ అయ్యింది గానీ, అదే పట్టణానికి 10 కి.మీ. దూరంలో ఉండే నడిపల్లి అనే గ్రామం మాత్రం ఇంక్లూడ్ కాలేదు. Very haphazard గా ఉందని తమరి ద్వారా మంత్రి గారి దృష్టికి తీసుకెళ్తున్నాను. దానిలో ముఖ్యంగా, డిచ్‌పల్లి అని మినీ టౌన్‌షిప్ నిజామాబాద్ పట్టణానికి 10 నుండి 13 కి.మీ.ల దూరంలో ఉంది. ఏరియల్ మార్గంలో 10 కి.మీ.ల దూరమే ఉంటుంది. అక్కడ ఒక యూనివర్శిటీ ఉంది, బెటాలియన్ ఉంది, రైల్వేస్టేషన్ కూడా ఉంది. అక్కడ సుమారు 20,000 జనాభా ఉంటుంది. అలాంటి ఆ ప్రాంతం కూడా నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటిలో ఇంక్లూడ్ కాలేదు. కాబట్టి, డిచ్‌పల్లి ప్రాంతాన్ని కూడా ఇంక్లూడ్ చేయాలని కోరుతూ, గ్రామాల ఎంపికను ఏ ప్రాతిపదికన చేపట్టారు, ఆయా గ్రామాల కన్సెంట్ తీసుకున్నారా, దాని క్రైటీరియా ఏమిటని మంత్రి గారిని అడుగుతున్నాను. అలాగే దీనిద్వారా కలిగే లాభాలను తెలపాల్సిందిగా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ కె. తారక రామారావు :-** అధ్యక్షా, గౌరవ సభ్యులు భూపతి రెడ్డి గారు మాట్లాడుతూ, ఏ ప్రాతిపదికన నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేశారని అడిగారు. 5 నుంచి 10 కి.మీ.ల రేడియస్‌ను ఒక ప్రాతిపదికగా తీసుకుంటూ, దానితోపాటు అక్కడ ఉన్న గ్రోత్ ట్రెండ్స్‌ని కూడా చూడడం జరిగింది. ఎందుకంటే, పట్టణాలు సర్వసాధారణంగా అన్ని వైపులా ఒకే విధంగా పెరగవు. కొన్ని దిశల్లో ఎక్కువగా పురోగతి ఉంటుంది. ఆ క్రమంలోనే 5 నుండి 10 కి.మీ.లు, మాగ్జిమమ్ 13 కి.మీ.ల దూరాన్ని ఒక రేడియస్‌గా తీసుకొని ఒక నిర్ణయం తీసుకోవడం జరిగింది. గౌరవ సభ్యులు నిజామాబాద్ పట్టణానికి 25 కి.మీ.ల దూరంలో ఉండే జూపల్లి గ్రామం గురించి ప్రస్తావించారు. ఏమైనా ఇబ్బందులుంటే, తప్పకుండా పునఃపరిశీలన చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

అధ్యక్షా, "ఎవరిని అడిగి చేశారు" అని కూడా ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో ఆరు కార్పొరేషన్లున్నాయి. ఈ ఆరు కార్పొరేషన్లు కూడా శరవేగంగా పెరుగుతున్నాయి కాబట్టి, స్థానిక శాసనసభ్యులు, అక్కడ ఉండే జిల్లా అధికారులతో ఈ దిశగా ఆలోచన చేసి, రాష్ట్ర ప్రభుత్వం ఒక కార్పొరేషన్ స్థాయి సంస్థను ఏర్పాటు చేయడానికి నిర్ణయం తీసుకుంది.

"దీనివల్ల ఏమి లాభాలున్నాయ"ని కూడా గౌరవ సభ్యులు అడిగారు. శరవేగంగా పెరుగుతున్న పట్టణాలు, ముఖ్యంగా పట్టణీకరణ కూడా పెరుగుతున్న నేపథ్యంలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి జరగాలి, అక్కడ ప్రజలకు కూడా అభివృద్ధి ఫలాలు అందాలి. దానితోపాటు జోనింగ్, మాస్టర్ ప్లానింగ్ కూడా సవ్యంగా జరగాలి. అక్కడ ఉండే ల్యాండ్ ప్యాటర్న్ కూడా మనం సరిగ్గా నిర్దేశించాలి అనే ఒక మంచి ఆలోచనతో చేపట్టిన కార్యక్రమం.

ఎందుకంటే, ప్రక్కన గ్రామపంచాయితీలున్నా, ఇతరత్రా డెవలప్‌మెంట్స్ ఉన్నప్పటికీ, వాటిలో కొంత విచ్చలవిడితనం ఉంటుంది. నియంత్రణ అనేది లోపిస్తుంది. కాబట్టి, Director, Town & Country Planning ద్వారా మనం కొంత ప్రణాళికాబద్ధమైన structured growth కోసం ఈ కార్యక్రమాన్ని చేస్తూ ఉన్నాం. దీనితోపాటు, ఈరోజు హెచ్.ఎం.డి.ఏ. ఏవిధంగానైతే హైదరాబాదు మహానగరానికి ఒక ప్రధానమైన ఆర్థిక వనరుగా ఉపయోగపడుతూ ఉందో, రేపటి రోజున నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ గానీ, శాతవాహన అర్బన్ డెవలప్‌మెండ్ అథారిటీగానీ,

అదేరకంగా ఖమ్మం కోసం ఏర్పాటు చేసిన స్థంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ గానీ ఆయా పట్టణాల పురోగతికి తోడ్పడాలి. వాటిలో అవి కూడా భాగం పంచుకోవాలి.

అధ్యక్షా, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి జరగాలి అనే ఆలోచనతో ముందుకు పోతున్నాం. గౌరవ సభ్యులు ప్రస్తావించినట్లుగా ఇందులో ఏమైనా చిన్నపాటి లోటుపాట్లు ఉంటే వాటిని సవరించుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలియజేస్తున్నాను.

**శ్రీ ఉల్లోళ్ళ గంగాధర్ గౌడ్:–** అధ్యక్షా, నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(నుడా)లో నడిపల్లి గ్రామ పంచాయితీ వరకు తీసుకుంటే బాగుంటుంది. ఎందుకంటే, నడిపల్లి మండల హెడ్‌క్వార్టరు. ఇంతకుముందు సభ్యులు భూపతి రెడ్డి గారు చెప్పినట్లు యూనివర్సిటీ గ్రామ పంచాయితీ పరిధిలో వస్తుంది కాబట్టి, మండల హెడ్ క్వార్టర్ పరిధిలో వస్తుంది కాబట్టి, నిజామాబాద్ నుంచి 12 కి.మీ.ల పరిధిలో మాత్రమే ఉంది. నిజామాబాద్ నుండి డిచ్‌పల్లి వరకు తప్పనిసరిగా అభివృద్ధి చెందేందుకు మంచి అవకాశముంటుంది. ఈ దిశగా ఆలోచన చేయాల్సిందిగా తమరి ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

మరొక విషయం అధ్యక్షా, "నుడా"లో ఏర్పాటు చేసిన తాత్కాలిక కమిటీకి ఛైర్మన్‌గా కలెక్టరు, వైస్ ఛైర్మన్‌గా కమీషనర్‌ను నియమిస్తూ, వారితోపాటు అర్బన్ ఎమ్మెల్యే, రూరల్ ఎమ్మెల్యేలకు కూడా సభ్యులుగా అవకాశమిచ్చారు. ఆయా నియోజకవర్గాల్లో ఉండే ఎమ్మెల్సీలకు కూడా కమిటీ మెంబర్లుగా అవకాశమివ్వాలని గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను. శాసనమండలి నుండి ప్రోటోకాల్ ఆప్షన్ ఉన్న వాళ్ళని కమిటీ మెంబర్లుగా వేస్తే, వారు కూడా సూచనలు, సలహాలు ఇవ్వడానికి వీలవుతుంది.

**డా. ఆర్. భూపతి రెడ్డి:–** అధ్యక్షా, మంత్రిగారు మాట్లాడుతూ, 5 నుండి 10 కి.మీ.ల రేడియస్ వరకు తీసుకోవడం జరిగిందన్నారు. కానీ, 10 కి.మీ.ల రేడియస్‌లో ఉన్న చాలా గ్రామాలు "నుడా"లో ఇంక్లూడ్ కాలేదు. ఈ విషయమై గౌరవ మంత్రిగారు దృష్టిసారించాలని కోరుతూ, నడిపల్లి, డిచ్‌పల్లి, యూనివర్సిటీ ప్రాంతాలను కూడా "నుడా"లో ఇంక్లూడ్ చేయాలని కోరుతున్నాను. చాలా గ్రామపంచాయితీల్లో వాళ్ళ అధికారాలు తీసేస్తారేమోనని వాళ్ళు భయపడుతున్నారు. "నుడా"లో ఉంటే వాళ్ళ అధికారాలు పోతాయేమోనని వాళ్ళు "నుడా"లో ఉండడానికి కూడా ఇష్టపడడం లేదు. కాబట్టి, ఈ విషయమై కూడా గ్రామపంచాయితీ, మండల ప్రజా పరిషత్తుల్లో ఉండే ప్రజాప్రతినిధులకు స్పష్టతనివ్వాలని మంత్రిగారిని కోరుతున్నాను.

**SRI. SYED AMINUL HASAN JAFRI (LOCAL BODIES - HYDERABAD):**

جناب سید امین الحسن جعفری (Janab Syed Aminul Hasan Jafri): صاحب آپ کا شکریہ کہ آپ نے مجھے بات کرنے موقع دیا۔ Hyderbad Metropolitan Development Authority اور Hyderabad Metropolitan Water Supply and Sewerage Board میں Non-official Members کو Nominate کرنے کا Provision ہے۔ اس میں چیرمین اور ممبر بنائے جاتے ہیں۔ اس میں Legislators بھی رہے سکتے ہیں۔ اور اس سے ہٹ کے دوسرے Eminent اور Persons کو بھی Nominate کرنے کا Provision رہتا ہے۔ HMDA جو 2007 میں بنے کے بعد آج تک Non-official Members کو fill نہیں کیا گیا۔ صاحب اور Hyderabad Metro Supply, Metropolitan Water Supply and Sewerage Board میں بھی Provision ہے۔ ان کو بھی ابھی تک fill نہیں کیئے ہیں۔ میری گزارش ہے کہ جتنا جلد ممکن ہو Non-Official ممبر کو بھی Nominate کریں۔

**శ్రీ కె. తారక రామారావు:–** అధ్యక్షా, గౌరవ సభ్యులు గంగాధర గౌడ్ గారు శాసనమండలి సభ్యులకు కూడా "నుడా" కమిటీలో పాత్ర కల్పించాలని కోరారు. తప్పకుండా అవకాశం కల్పిస్తామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

(బల్లలు చరచడం ద్వారా సభ్యులు తమ హర్షాతిరేకాలను వ్యక్తపరిచారు.)

శాసనసభ్యులతోపాటు, శాసనమండలి సభ్యుల గౌరవాన్ని, ఔన్నత్యాన్ని కాపాడాల్సిన బాధ్యత మన మీద ఉంది. కాబట్టి, తప్పకుండా చేస్తాం. ఇంకా వారు మాట్లాడుతూ, నడిపల్లి గ్రామాన్ని కూడా "నుడా"లో కలిపితే బాగుంటుందని కోరారు. తప్పకుండా పరిశీలిస్తాం.

గౌరవ సభ్యులు భూపతి రెడ్డి గారికి నేను విజ్ఞప్తి చేసేదేమంటే, 5 నుంచి 10 కి.మీ.ల రేడియస్‌ను ఒక ప్రాతిపదికగా తీసుకున్నప్పటికీ, కొన్ని కొన్ని సందర్భాల్లో, ఆయా నగరాల్లో ఉండే పరిస్థితులను బట్టి, 13 కి.మీ. వరకు కూడా తీసుకున్నామని చెప్పాను. దాన్ని వారు సరిగ్గా అర్థం చేసుకున్నట్లు లేరు. కానీ, 5 నుండి 10 కి.మీ.ల దూరంలోని కొన్ని గ్రామాలు కవర్ కాలేదని వారన్నారు. అవసరమైతే ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి, వారిని కూడా ఆహ్వానించి, వారితో సంబంధిత శాసనసభ్యులను, గౌరవ మంత్రిగారిని కూడా ఆహ్వానించి, ఒకవేళ ఇంకా ఏమైనా లోటుపాట్లు ఉంటే,

తప్పకుండా వాటిని సవరిస్తామని తమరి ద్వారా తెలియజేస్తున్నాను.

جعفری صاحب نے جس کا ذکر کیا۔ ہم اندرون ایک ہفتہ میں Nominate کرینگے۔ HMDA or HMWS میں آج فی الحال چیرمین Honorable Chief Minister ہیں۔ کیوں کہ ان کی اہمیت کو مدنظر رکھتے ہوئے ہم نے اس میں جو ایکٹ تھا معمولی Amendment لائے ہیں اور آج سی ایم صاحب اس کے چیرمین ہیں اور متعلقہ منسٹر اس کے وائس چیرمین ہیں۔ اس میں ممبرس کو Nominate کرنا ہے۔ اس کو ایک ہفتہ یا دس دن کے اندر مکمل کرلیا جائے گا۔ اس کا آپ کو میں یقین دلاتا ہوں۔

## వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో అవకతవకలు

ప్రశ్న నెం.2195(48)

శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్, శ్రీమతి ఆకుల లలిత, సర్వశ్రీ కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి, టి. సంతోష్‌కుమార్, ఎం.ఎల్.సి.లు:- గౌరవనీయులైన వ్యవసాయ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

(అ) 2016-17 సంవత్సరంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలులో కొన్ని అవకతవకలు జరిగిన విషయం వాస్తవమేనా;

(ఆ) సదరు పథకం క్రింద ట్రాక్టర్లను రాష్ట్రంలోని అనర్హులైన వ్యక్తులకు మంజూరు చేసిన విషయం కూడా వాస్తవమేనా;

(ఇ) అయితే, ఆ వివరాలేమిటి;

(ఈ) ఈ విషయంలో తీసుకున్న చర్యలేమిటి?

వ్యవసాయ శాఖ మంత్రి (శ్రీ పోచారం శ్రీనివాస రెడ్డి):- (అ) లేదండీ.

(ఆ) లేదండీ.

(ఇ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

(ఈ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

**శ్రీమతి ఆకుల లలిత (శాసనసభ నియోజకవర్గం):-** అధ్యక్షా, యాంత్రీకరణ పథకం క్రింద అర్హులను ఏవిధంగా గుర్తించడం జరుగుతోంది? అర్హులకు ఇస్తున్నారా, అనర్హులకు ఇస్తున్నారా, కార్యకర్తలకు ఇస్తున్నారా, కాంట్రాక్టర్లకు ఇస్తున్నారా, మరి ఎవరికి ఇస్తున్నారో ఒక విజిలెన్స్ కమిటీని వేసి, ఎంక్వైరీ చేయించండి. ట్రాక్టర్లు అసలు ఉన్నాయా, అమ్ముకున్నారా? మేము సిఫారసు చేసిన వాళ్ళకి ఎవ్వరికీ ఇంతవరకు ఎందుకు ఇవ్వడంలేదని గౌరవ మంత్రిగారిని తమరి ద్వారా అడుగుతున్నాను.

**శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి:-** అధ్యక్షా, ట్రాఫిక్ జామ్ వల్ల మా నాయకులు, ప్రతిపక్ష నాయకులు సభకు రాలేకపోయారు. కాబట్టి, వారి తరఫున గౌరవ వ్యవసాయ శాఖ మంత్రిగారికి ఒక విజ్ఞప్తి చేస్తున్నాను.

(ఆ సమయంలో గౌరవ ప్రతిపక్ష నాయకులు సభలోకి రాగానే, కొందరు సభ్యులు "మీ నాయకుడు వచ్చేశారు" అని అనసాగారు.)

ఓ.కే. వారు కూడా మాట్లాడతారు. గౌరవ ఛైర్మన్ గారు నాకు సమయమిచ్చినందుకు నేను ఈలోగా మాట్లాడతాను.

అధ్యక్షా, వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో జరుగుతున్న అవకతవకలపై ప్రధానంగా ఈ ప్రశ్నను అడగడం జరిగింది. అన్నింటికీ, లేదండీ, ఉత్పన్నం కాదని సమాధానం చెప్పారు. నేను ఈ సభ ద్వారా, తమరి ద్వారా గౌరవ మంత్రిగారినీ, ప్రభుత్వాన్నీ కోరేదేమంటే, 2016-17లో లబ్ధిదారులు ఎంతమంది ఉన్నారు, ఎంతమందికి ఇచ్చారు? ఆ లిస్టును గౌరవ సభ ముందు పెడితే, దానిలో.., మేము "ఛాలెంజ్" లేదా అటువంటి మరో పదాన్నో ఉపయోగించదలచుకోలేదుగానీ, ఎన్ని అవకతవకలు జరిగాయి, అనర్హులకు ఎన్ని వచ్చాయి? అధికార పార్టీ కార్యకర్తలు లబ్ధిదారుల్లో ఎంతమంది ఉన్నారు? ఎమ్మెల్యేలు, ఇంకా ఇతరులు ఎంత జోక్యం చేసుకొని.., ఇది ఓపెన్ సీక్రెట్ అధ్యక్షా. కేవలం వారి పార్టీకి సంబంధించిన రికమెండేషన్లతోనే ఈ వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో లబ్ధిదారులను ఎంపిక చేశారన్నది మా ఆరోపణ. దీనిమీద నిజముంటే బయటకి వస్తుంది. కాబట్టి, తమరు దయచేసి దీనిమీద ఒక డీటెయిల్డ్ ఎంక్వైరీ వేసి, దానిమీద సమగ్ర దర్యాప్తు జరపాలని మీద్వారా నేరుగా మంత్రిగారిని నేను కోరుతున్నాను.

**శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్ (శాసనసభ నియోజకవర్గం):-** థ్యాంక్యూ సార్. ట్రాఫిక్ ఇబ్బందుల వల్ల సభకు రావడం కొంత ఆలస్యమయింది. ఈ ప్రశ్నలో ఇప్పుడే మా డెప్యూటీ లీడర్ సుధాకర్ రెడ్డి గారు చెప్పినట్లు, ఈ ట్రాక్టర్ల పంపిణీ విషయంలో చాలా అవకతవకలున్నాయి. మంత్రిగారికి కూడా తెలుసు. నేను స్వయంగా మంత్రిగారికే చెప్పాను. ఒక దళితుడు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని అర్హతలు ఉండి, రూ.5.00లక్షలు వడ్డీకి తీసుకువచ్చి డి.డి. కూడా కట్టాడు. కేవలం ఒక దళితుడు అని, పార్టీకి సంబంధించి కాదు అని చెప్పి.., కేవలం భూమి లేని టి.ఆర్.ఎస్.కు సంబంధించినవాళ్ళకు, కామారెడ్డిపట్టణంలో ఉండేవాళ్ళకు.., నేను పేర్లిస్తాను. విజిలెన్స్ ఎంక్వైరీకి ఆర్డరు వేయండి. ప్రూఫ్

చేయకుంటే, నేను ఏ శిక్షకైనా రెడీగా ఉన్నాను. ఆరోజు నేను చెప్పిన తరువాత మంత్రి గారు కూడా ప్రయత్నం చేశారు. అది కాలేదు. ఒక దళితుడు వడ్డీకి డబ్బులు తీసుకువచ్చి మ్యాచింగ్ గ్రాంట్ బ్యాంకులో కట్టి, డి.డి. కట్టి, అన్ని అనుమతులు వచ్చిన తరువాత రాజకీయంగా.. నో అంటే నో. అంటే, కమిటీ నిర్ణయమంటే లెక్కలేదు. అక్కడున్న శాసనసభ్యుడు, ప్రభుత్వంలో ఎవరున్నారో, వాళ్ళు టిక్ కొడితే ఇవ్వాలి. కేవలం భూములు లేనివాళ్ళు, భూములకు సంబంధం లేనివాళ్ళు, వ్యవసాయానికి సంబంధం లేనివాళ్ళ దగ్గర ఇవాళ 70 శాతం ట్రాక్టర్లు ఉన్నాయని నేను రుజువు చేయకుంటే, మీరు ఏ పనిష్మెంటు ఇస్తే దానికి నేను సిద్ధంగా ఉన్నాను. లేదంటే, మంత్రిగారు కమిటీ వేయడానికి సిద్ధంగా ఉన్నారా? లేదా? అని అడుగుతూ కమిటీ వేయాలని నేను డిమాండ్ చేస్తున్నాను.

**శ్రీ కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి (స్థానిక సంస్థలు-మహబూబ్‌నగర్):-** అధ్యక్షా, రైతులకు ట్రాక్టర్లు ఇచ్చే పథకం మంచిదే. కానీ, అది మిస్‌యూజ్ అవుతున్న పరిస్థితి ఉంది. శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్ గారు చెప్పినట్లు కొన్ని ఇబ్బందికర పరిస్థితులున్నాయి. వ్యవసాయం చేయకుండా కాంట్రాక్టు పనులు చేసేవాళ్ళకు, వ్యవసాయాన్ని విడిచిపెట్టి పట్టణాల్లో ఉంటున్న వాళ్ళకు ట్రాక్టర్లు ఇచ్చి రైతులను ఇబ్బంది పెడుతున్నటువంటి పరిస్థితి ఉంది. గత ఐదారు నెలల క్రితం ఒక బి.సి. వ్యక్తికి ట్రాక్టరు ఇవ్వాల్సిందిగా నేను ముఖ్యమంత్రి గారికి సిఫార్సు చేస్తే, ముఖ్యమంత్రిగారు అక్కడున్న పి.ఎస్. గారికి కూడా ఇవ్వమని చెప్పడం జరిగింది. కానీ, అది ఇంత వరకు ఇంప్లిమెంట్ కాలేదు. ముఖ్యమంత్రిగారు చెప్పినప్పటికీ ఇంప్లిమెంట్ కానందుకు మాకు బాధ కలిగించింది. అధ్యక్షా, మా నియోజకవర్గంలో ఇప్పటికే కొన్ని ట్రాక్టర్లు అమ్ముడుపోయాయి. ఒకసారి బ్యాంకర్స్ మీటింగులో కూడా బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్స్ చెప్పడం జరిగింది. 50 శాతం రుణం, 50 శాతం రాయితీ కాబట్టి, బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్స్ ఉన్నారు. వారితోపాటు, వ్యవసాయ అధికారులు కూడా కలిసి యాంత్రీకరణ పథకంలో ఇచ్చిన ట్రాక్టర్లు గ్రామంలో వ్యవసాయం చేస్తున్నయా, ఎక్కడికైనా కాంట్రాక్టు పనులకు పోయాయా, శాండ్ కార్టింగ్ చేస్తున్నయా అనే విషయాలను ఎంక్వైరీ చేసి వాళ్ళను నియంత్రించకపోతే ప్రభుత్వ పథకం, ప్రజాధనం వృధా అవుతుందనేది మా భావన. గౌరవ మంత్రిగారు ఈ విషయంలో తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

**శ్రీ పోచారం శ్రీనివాస రెడ్డి:** అధ్యక్షా, వ్యవసాయాన్ని లాభసాటిగా తీసుకురావాలనే ప్రక్రియలో భాగంగా, వ్యవసాయంలో ట్రాక్టర్లు ఇచ్చే కార్యక్రమం ఉంది. రాష్ట్రంలో టి.ఆర్.ఎస్. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దీన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాలనే సంకల్పంతో, గతంలో ఎంత రాయితీ ఇచ్చారో, ఆ రాయితీల కంటే ఎక్కువ రాయితీలిచ్చి రైతు యొక్క ఆర్థిక భారాన్ని తగ్గించే క్రమంలో, ట్రాక్టర్లతోపాటు మిగిలిన యంత్రసామాగ్రి ఇస్తున్నాము. గౌరవ సభ్యులు, సోదరీమణి శ్రీమతి ఆకుల లలిత గారు మాట్లాడుతూ మిస్‌యూజ్ అని అన్నారు. అటువంటి మిస్‌యూజ్‌కు ఇక్కడ అవకాశం లేదు. రైతులు కాని వాళ్ళు అని అన్నారు, టిఆర్ఎస్ పార్టీ వాళ్ళు అని అన్నారు. టిఆర్ఎస్‌లో రైతులున్నారు, కాంగ్రెస్‌లో రైతులున్నారు, టిడిపి రైతులున్నారు, వామపక్ష రైతులున్నారు. ఏ రైతుకైతే అర్హత ఉందో అతనికి, ఏ పార్టీ వాళ్ళైనా కూడా, పార్టీలకు అతీతంగా ఇవ్వడం జరిగింది. టిఆర్ఎస్ పార్టీకి సంబంధించిన వ్యక్తి అర్హతగల రైతు అయ్యుండవచ్చు. అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకులు శ్రీ జానారెడ్డి గారు ఒక కాపీ ఇవ్వమని అడిగారు. వారికి సాఫ్ట్ కాపీ ఇచ్చాం. అక్కడ, గౌరవ శాసనసభ్యులు కాంగ్రెస్ పార్టీ వారైనా, వారు సిఫారసు చేస్తే, ఆ సిఫారసును జిల్లాకు పంపించి, కోమటిరెడ్డి గారు సిఫారసు చేస్తే ఇచ్చాం, పిసిసి ప్రెసిడెంటు ఉత్తమ్ కుమార్ రెడ్డి సిఫారసు చేస్తే ఇచ్చాం. సోదరీమణి పద్మావతి గారు సిఫారసు చేస్తే ఇచ్చాం.

**శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి :-** (మైకు లేకుండా) అసెంబ్లీలో కాపీ ఇచ్చి, మమ్మల్ని తెచ్చుకోమంటే ఎలా అధ్యక్షా. ఈ పెద్దల సభలో కూడా ఒక కాపీ ఇవ్వమనండి.

(అంతరాయం)

**మిస్టర్ ఛైర్మన్ :-** సుధాకర్ రెడ్డి గారూ, మంత్రిగారు చెప్పే సమాధానం పూర్తవ్వనీయండి. ఆ తరువాత మాట్లాడండి.

**శ్రీ పోచారం శ్రీనివాస రెడ్డి :-** అధ్యక్షా, ఇది పద్ధతి కాదు. వారు మాట్లాడుతున్నప్పుడు విన్నా, నేను నోట్ చేసుకున్నాను. మీరూ నోట్ చేసుకోండి. తరువాత మాట్లాడండి. మాట్లాడుతున్నప్పుడు క్రాస్ టాక్ వద్దు. ఇది పెద్దల సభ. ఆ మాత్రం హుందాతనం ఉండాలి.

అధ్యక్షా, పార్టీలకు అతీతంగా ఏ శాసనసభ్యుడు సిఫారసు చేసినా, ఆ కాగితాలను జిల్లాకు పంపిస్తే, జిల్లా కమిటీ వాళ్ళు సిఫారసు చేసి ఇచ్చారు. అందులో కాంగ్రెస్ రైతులున్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలున్నారు. టిఆర్ఎస్

పార్టీ కార్యకర్తలున్నారు. అన్ని పార్టీల కార్యకర్తలున్నారు. రైతు అనే వాడిని గుర్తు పెట్టుకొని, రైతు పేరుతోటి రెండున్నర ఎకరాల కనీస పట్టా భూమి ఉన్నటువంటి వాళ్ళకు, వారు ఇండివిడ్యువల్ అయితే ఇండివిడ్యువల్‌గా ఇచ్చాం. గ్రూప్‌గా వస్తే గ్రూప్‌కు ఇచ్చాం. ఇందులో ఎలాంటి అవకతవకలు జరగలేదు.

(అధికారపక్షసభ్యులు బల్లలు చరచడం ద్వారా హర్షాన్ని వ్యక్త పరిచారు.)

ఎలాంటి పొరపాట్లు జరగలేదు. అన్ని పార్టీల వారికి ఈ పథకం క్రింద ట్రాక్టర్లు ఇచ్చాం.

10.40 ఉ. అధ్యక్షా, Farm Power Availability అని ఒక ఫార్ములా ఉంది. వ్యవసాయంలో కూలీలు, యంత్రాలు ఎవరు ఎలా పనిచేస్తున్నారనే కోణంలో ఆలోచిస్తే, దేశంలో పంజాబ్ నంబర్ వన్‌లో ఉంది, హర్యానా నెం.2, తెలంగాణ నెం.3లో ఉంది. కాబట్టి వ్యవసాయాన్ని ఇంకా ప్రోత్సహిద్దాం. ఇంతపెద్ద కార్యక్రమం జరిగినప్పుడు ఎక్కడైనా చిన్న, చిన్న లోపాలుంటాయి. వాటిని సరిచేసుకుందాం. టిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక గౌరవ ముఖ్యమంత్రి గారి ఆదేశానుసారం గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ వ్యవసాయ యాంత్రీకరణకు ప్రాధాన్యతనిచ్చి నిధులు పెంచాం. కాబట్టి, పార్టీలకతీతంగా దరఖాస్తు పెట్టుకున్న వ్యవసాయదారులు ఎవరైనా సరే నియమ నిబంధనలకు అనుగుణంగా ఈయొక్క యాంత్రీకరణ కార్యక్రమాన్ని అమలు చేస్తాము.

**శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్:-** అధ్యక్షా, నా దగ్గరకు ఒక వ్యక్తి వచ్చి మెరిట్‌లో వచ్చాను, నేను దళితుడిని, బ్యాంకు గ్యారంటీగా ఐదు లక్షల రూపాయలు అప్పు తీసుకువచ్చి కట్టాను. ఇప్పుడేమో కలెక్టర్ కార్యాలయం నుండి నీ డి.డి. నీవు వాపస్ తీసుకోమని అంటున్నారని, ఆ గ్యాప్ పీరియడ్ మిత్తి ఎవరు కట్టాలి సార్ అని తాను నాకు చెప్పాడు. ఆ విషయంపై ప్రత్యేకంగా గౌరవ మంత్రి వర్యులతో మాట్లాడాను. గౌరవ మంత్రివర్యులు కూడా వెంబడే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడితే వ్యవసాయాధికారి ఈ దళిత వ్యక్తికి ఫోన్ చేసి డి.డి. వాపస్ తీసుకోవాల్సిన అవసరం లేదు, కొన్ని రోజులు ఓపిక పట్టండని చెప్పాడు. మంత్రి గారికి చెప్పినందుకు ఇంకో మాసం ఆలస్యమై నాలుగు మాసాల అనంతరం అతని డి.డి. అతనికి వాపస్ ఇవ్వడం జరిగింది. నేను ఎప్పుడు ఎవరికీ సిఫారసు చేయలేదు, చేయను కూడా. మెరిట్ ప్రకారంగానే ఇవ్వమని చెబుతున్నాను. రైతులకు మేలు జరుగుతుందని అంటే, ఆ పార్టీ, ఈ పార్టీ అని ఏమీ లేదు.

ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ఎవరైతే అర్హులు ఉంటారో, వారికి ఇస్తే సరిపోతుంది. ఎమ్మెల్యే గారు సిఫారసు చేయాలని ఎక్కడుంది? గౌరవ మంత్రివర్యులు ఎమ్మెల్యే గారు సిఫారసు చేస్తేనే ఇస్తామని తప్పు చెబుతున్నారు. ఎవరైనా రైతులకు అన్యాయం జరిగినప్పుడు ఎమ్మెల్యే గారు గానీ, ఎమ్మెల్సీ గారు గానీ మంత్రి గారి దృష్టికి తీసుకువెళ్లి అర్హులకు న్యాయం చేయాలని చెప్పాలి. సార్, మైక్ కట్ అయింది సార్.

**మిస్టర్ ఛైర్మన్:-** మీరు ఒక సీనియర్ అపోజిషన్ లీడర్, ఛైర్‌ను ఉద్దేశించి మాట్లాడాలి. అటూ, ఇటూ చూసి ఎందుకు మాట్లాడుతున్నారు.

**శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్:-** అధ్యక్షా, మంత్రి గారి రిప్లై ఎలా ఉంటుందని, కొంత ఆవేశంతో అక్కడ చూస్తున్నాను. ఒక దళితుడికి అన్యాయం జరిగిందనే విషయాన్ని మాట్లాడడానికి కూడా అవకాశం ఇవ్వకుంటే ఎలా సార్.

**మిస్టర్ ఛైర్మన్:-** ముఖాలు చూసుకుంటే ఆవేశాలు వస్తాయి. మనకు ఆవేశాలు అవసరం లేదు, ఆలోచన కావాలి. నన్ను చూస్తూ మాట్లాడండి.

**శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్:-** అధ్యక్షా, నేను ప్రత్యేకంగా ఒక దళిత వ్యక్తి గురించి అడిగాను. వడ్లూరి గ్రామంలో ఒక దళిత వ్యక్తి మెరిట్‌లో వచ్చిన తరువాత అతనికి న్యాయం జరగలేదని నా దగ్గరకు వచ్చినప్పుడు, ఆ విషయాన్ని గౌరవ మంత్రిగారి దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ తుదకు డి.డి. వాపస్ ఇవ్వడం జరిగింది. విషయం ఏమంటే నీకు రాజకీయంగా అండదండలు లేవు, నీకు ఇవ్వము, మావారికే ఇచ్చుకుంటామని చెప్పడం జరిగింది. ఇది వాస్తవమా, కాదా దానికి సమాధానం చెప్పాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. అర్హులున్న వారికి ఇవ్వండి, నిజంగా కూడా 100శాతం టిఆర్ఎస్ పార్టీ వారే అర్హులుంటే వారికే ఇవ్వండి. ఒక దళిత వ్యక్తి అంత అమౌంట్‌తో డి.డి. తీసుకొని నాలుగు మాసాల మిత్తీ మీద పడితే అతనికి ఎంత ఇబ్బంది ఉంటుంది, ప్రభుత్వం ఆ విషయాన్ని ఆలోచించాలి.

**శ్రీ పోచారం శ్రీనివాస రెడ్డి:-** అధ్యక్షా, శాసనసభ్యులని ఎందుకు అన్నానంటే, ప్రజాప్రతినిధులు కాబట్టి, రైతులు వారి దగ్గరకు వస్తుంటారు. శాసనసభ్యులు

సిఫారసు చేసిన వ్యక్తులకు ఇవ్వమని చెప్పడం లేదు. ఆ వివరాలు సంబంధిత జిల్లాలకు పంపించి అక్కడ పరిశీలించిన అనంతరం అర్హత ప్రకారమే వారికి ఇస్తారు. ఎమ్మెల్యేలు ఇచ్చినా, ఎమ్మెల్సీలు ఇచ్చినా, మంత్రులిచ్చినా తీసుకోవడం సహజం. ఇచ్చినటువంటి సిఫారసులను జిల్లాలకు పంపిస్తాము. అక్కడ సంబంధిత అధికారులు పరిశీలించి ఎవరినైతే అర్హులుగా భావిస్తారో, వారికి ఇస్తారు. గౌరవ ఎల్‌ఓపి గారు ప్రత్యేకంగా ఒకతని గురించి చెప్పారు. తప్పకుండా దానిని పరిశీలించి తగు చర్య తీసుకుంటాము.

**శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్:–** అధ్యక్షా, నేను ఆ విషయాన్ని చెప్పి, సంవత్సరంన్నర అవుతోంది. ఇంకా ఏమి పరిశీలిస్తారు? అతడు దుబాయ్ వెళ్లిపోతానని అన్నాడు. వెళ్లిపోయాడో, ఇంకా లేదో నాకు తెలియదు. గౌరవ మంత్రివర్యుల సమాధానం అసంతృప్తిగా ఉంది. వారు విజిలెన్స్ ఎంక్వైరీకి ఒప్పుకోవడం లేదు. కాబట్టి, కాంగ్రెస్ పార్టీ తరఫున ఈ ప్రశ్నపై వాకౌట్ చేస్తున్నాము.

(కాంగ్రెస్ పార్టీ సభ్యులు శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్, శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి, శ్రీ కె.దామోదర్ రెడ్డి మరియు శ్రీమతి ఆకుల లలిత సభ నుండి నిష్క్రమించారు.)

## వ్యవసాయ రంగానికి 24 గంటల విద్యుత్తు సరఫరా

ప్రశ్న నెం.2374(43)

డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎం.ఎల్.సి.:– గౌరవనీయులైన ఇంధన శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

(అ) రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో వ్యవసాయ రంగానికి నిరంతర విద్యుత్ సరఫరాను అమలు చేస్తున్న విషయం వాస్తవమేనా;

(ఆ) అయితే, ఆ వివరాలేమిటి;

(ఇ) దానిని ఇతర జిల్లాలకు కూడా విస్తరించడాన్ని పరిశీలించడమవుతుందా;

(ఈ) అయితే, ఈ విషయంలో తీసుకుంటున్న చర్యలేమిటి?

ఇంధన శాఖ మంత్రి (శ్రీ జి. జగదీష్ రెడ్డి):– (అ) అవునండీ.

(ఆ) రాష్ట్రంలో ట్రయల్ ప్రాతిపదికన వ్యవసాయ రంగానికి నిరంతర విద్యుత్ సరఫరాను 10 క్రొత్త జిల్లాలలో అనగా మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, నల్గొండ, యాదాద్రి, సూర్యాపేట, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాలలో ప్రస్తుతం అమలు చేయడమవుతున్నది.

(ఇ) అవునండీ.

(ఈ) జిల్లాలన్నింటిలో వ్యవసాయ రంగానికి నిరంతర విద్యుత్ సరఫరాను విస్తరించడానికి, అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడం, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచడం, టిఎస్ డిస్కమ్స్, టిఎస్ ట్రాన్స్‌కోలో అదనపు లైన్లను వేయడం వంటి మౌలిక సదుపాయాలను సమకూర్చడానికి చర్యలు తీసుకోవడమవుతున్నది. దీని నిమిత్తం టిఎస్ ట్రాన్స్‌కో రూ.124.66 కోట్లు మరియు తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు రూ.362.64 కోట్లను వెచ్చిస్తున్నాయి.

**డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి:–** అధ్యక్షా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే అసాధ్యాన్ని సుసాధ్యం చేసి ఆరు నెలల్లోనే వ్యవసాయ పంప్‌సెట్లకి విద్యుత్‌ను అందించడమనేది చరిత్రాత్మకం. అందుకు గౌరవ మంత్రిర్యులకు మరియు గౌరవ ముఖ్యమంత్రి గారికి ధన్యవాదాలు. అధ్యక్షా, ఇప్పటికే పది జిల్లాల్లో 24 గంటల నిరంతర విద్యుత్‌ను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం చెబుతోంది. అందుకు ఎంత లెంగ్త్ ట్రాన్స్‌మిషన్ లైన్స్ వేశారు, ఇంతకుముందు కంటే ఇప్పుడు కొత్తగా ఎన్ని ట్రాన్స్‌ఫార్మర్లు బిగించారు, ఎన్ని సబ్ స్టేషన్స్ నిర్మించారు, వాటికి అయినటువంటి ఖర్చు ఎంత అనేది తెలియజేయాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అలాగే, పది జిల్లాలకే కాకుండా మిగతా 21 జిల్లాలకు కూడా 24గంటల విద్యుత్‌ను అందించాలని అనుకుంటున్నామని అంటున్నారు. ఆ 21 జిల్లాలకు కావాల్సిన ట్రాన్స్‌మిషన్ లైన్స్ ఎంత? ఎన్ని ట్రాన్స్‌ఫార్మర్లు బిగిస్తారు, ఎన్ని సబ్‌స్టేషన్స్ నిర్మిస్తారు, వాటికి అయ్యేటువంటి ఖర్చు ఎంత అనేది తెలియజేయాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ఒకవేళ మిగతా జిల్లాలకు కూడా 24 గంటలు విద్యుత్‌ను అందించాలనుకుంటే ఆ పనులు ఎప్పటిలోగా పూర్తి చేస్తారు?

ఈమధ్య కాలంలో యాదాద్రి గానీ, మిగతా జిల్లాలలోని అనేకమంది రైతులు బోర్లవద్ద ఆటోమేటిక్ స్టార్టర్స్ పెట్టుకోవడం వల్ల లోతుగా వేసుకున్న బోర్ల వారికి ఎక్కువగా నీరు పోతోంది గానీ తక్కువ లోతు వేసుకున్న బోర్ల వద్ద నీరు రావడం లేదని 24గంటలు వద్దు మాకు 9గంటల

విద్యుత్ మాత్రమే చాలు అని అనేకమంది గ్రామ పంచాయతీల ద్వారా తీర్మానం చేసి వారి దరఖాస్తులను ప్రభుత్వానికి సమర్పించడం జరుగుతున్నది. అటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ఏ ఆలోచనతో ఉందో గౌరవ మంత్రివర్యులు సవివరంగా సమాధానం ఇవ్వాలని మీద్వారా కోరుతున్నాను.

(వాకౌట్ చేసిన కాంగ్రెస్ పార్టీ సభ్యులు శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్, శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి, శ్రీ కె. దామోదర్ రెడ్డి మరియు శ్రీమతి ఆకుల లలిత తిరిగి సభలోకి వచ్చారు.)

**శ్రీ జి. జగదీష్ రెడ్డి:–** అధ్యక్షా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి ఇప్పటి వరకు గౌరవ సభ్యులు, సబ్‌స్టేషన్లు, లైన్స్, ట్రాన్స్‌ఫార్మర్స్ రెండు డిస్ట్రిబ్యూషన్స్ ద్వారా అదనంగా ఎంత వచ్చాయని అడుగుతున్నారు. కొత్తగా వేసిన 400కెవిలో 2695సికెఎం, 220కెవిలో 6,900సికెఎం, 132కెవిలో 10,321సికెఎం. మొత్తంగా ట్రాన్స్‌మిషన్‌లో 19,916 సర్కిల్ కిలోమీటర్లు లైన్స్ వేయడం జరిగింది.

డిస్ట్రిబ్యూషన్ కంపెనీలకు సంబంధించి 515 33/11కెవి సబ్‌స్టేషన్స్, 4,170కిలోమీటర్ల 33కెవి లైన్స్, అడిషనల్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్స్ 1602, పవర్ ట్రాన్స్‌ఫార్మర్స్ ఎన్‌హాన్స్‌మెంట్ 891. ఈ రకంగా డిస్కమ్స్‌లో సబ్‌స్టేషన్స్ అభివృద్ధి చేయడం జరిగింది.

అదేవిధంగా 11కెవి లైన్స్ 25,550కిలోమీటర్లు వేయడం జరిగింది. డిస్ట్రిబ్యూటరీ ట్రాన్స్‌ఫార్మర్స్ 1.64లక్షలు అదనంగా వేయడం జరిగింది. దీనిలో ప్రధానంగా ఇప్పటివరకు దాదాపు 20వేల కోట్లకు పైగా ఖర్చు పెట్టి ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ లైన్స్, సబ్‌స్టేషన్స్, ట్రాన్స్‌మిషన్స్ కూడా పూర్తి చేయడం జరిగింది.

ప్రస్తుతం పైలెట్ ప్రాజెక్టు క్రింద మూడు పాత జిల్లాలు మరియు కొత్తగా ఏర్పడిన పది జిల్లాల్లో ఏదైతే అమలు చేస్తున్నామో, దానిలో తప్పకుండా మొత్తం అన్ని జిల్లాలకు కూడా వ్యవసాయానికి 24గంటల విద్యుత్‌ను అందించడానికి కావాల్సిన ఏర్పాట్లు చేయడానికి గౌరవ ముఖ్యమంత్రి గారు దృఢ నిశ్చయంతో ఉన్నారు. దానికి సంబంధించిన ఏర్పాట్లన్నీ కూడా పూర్తి చేస్తున్నాము.

కొన్ని గ్రామాల నుండి గ్రామ పంచాయతీలు, మండల ప్రజా పరిషత్తులు తీర్మానం చేసి మాకు 24గంటలు విద్యుత్ వద్దు అనే తీర్మానాలను పంపించడం జరిగింది. కానీ, గౌరవ ముఖ్యమంత్రి గారు ఎట్టి పరిస్థితుల్లో 24 గంటల విద్యుత్‌ను రైతాంగానికి అందించాల్సిందే అనే పట్టుదలతో ఉన్నారు. దానికి సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తి కావస్తున్నాయి. ఇంకో మూడు, నాలుగు నెలల్లో మొత్తం తెలంగాణ రాష్ట్రంలో 24గంటలు విద్యుత్‌ను అందుబాటులో ఉంచుతాము, అందులో సందేహం ఏమీ లేదు.

దీంట్లో సమస్య ఎందుకు వచ్చిందంటే, గతంలో విద్యుత్ ఇబ్బందిగా ఉండి తక్కువ గంటలు వచ్చినప్పుడు, వచ్చిన ప్రతిక్షణం కూడా వాడుకోవాలనే ఉద్దేశ్యంతో రైతాంగం ఆటోమెటిక్ స్టార్టర్ల వైపు వెళ్లింది. ఎందుకంటే, పంటల వద్దకు వెళ్లి విద్యుత్ ఎప్పుడు అందుబాటులో ఉంటుందనే ఆలోచనతో 24గంటలు అక్కడ కూర్చుని పెట్టుకోవాలనే ఉద్దేశ్యంతో గతంలో రైతులు ఆ పద్ధతికి అలవాటుపడి ఉన్నారు. ఇప్పుడు 24గంటలు విద్యుత్‌ను అందించేవరకు 24గంటలు మోటార్లు నడుస్తూనే ఉన్నాయి. కొన్ని చోట్లనేమో అవసరం లేకున్నా కూడా వాటర్ ఎక్కువ బయటకు వస్తుందని అనుకుంటున్నారు. కొంతమంది రైతులకేమో మూడు, నాలుగు గంటలు మోటార్లు వేయగానే బోర్లలోని నీరు అయిపోతుంది, మళ్లీ ఆ నీళ్లు రావడానికి సమయం పడుతుంది కాబట్టి, మేము వెళ్లి పెట్టుకోవడం ఇబ్బంది అనే దాంట్లో కొంతమంది రైతులు 24గంటలు విద్యుత్ వద్దని అంటున్న మాట వాస్తవం.

ప్రారంభంలో వర్షాలు లేని కారణంగా ఆ కంప్లయింట్స్ ఎక్కువగా ఉండేవి. కానీ, అదృష్టవశాత్తు వర్షాలు నెల, రెండు నెలల నుండి బాగా కురిసి నీళ్లు వచ్చిన తరువాత కొంతమంది రైతుల నుండి అటువంటి విజ్ఞప్తులు కూడా తగ్గాయి. వచ్చే సంవత్సరం కూడా ఇదేరకంగా సమయానికి వర్షాలు పడి చెరువుల్లోకి, రిజర్వాయర్లలోకి నీళ్లు వస్తే రైతాంగం తప్పకుండా ఈ 24గంటల విద్యుత్ అందుబాటులో ఉండాలనే కోరుకుంటారని మేము భావిస్తున్నాము. ప్రత్యేకించి గౌరవ ముఖ్యమంత్రి గారి ఆలోచన ఏమంటే, ప్రతి వినియోగదారుడి ఇంట్లో 24గంటలు విద్యుత్ అంటుబాటులో ఉన్నప్పుడు అతనికి ఎప్పుడు లైటు అవసరమో అప్పుడే వేసుకుంటాము, ఎప్పుడు ఫ్యాన్ అవసరమో అప్పుడే వేసుకుంటాము, ఎప్పుడు ఏసి అవసరమో అప్పుడే వేసుకుంటాము, ఏ రూంలో, ఏ హాల్లో ఎప్పుడు అవసరమో అప్పుడే వేసుకుంటాం. అలాగే రైతాంగం కూడా వారు ఎవరి పనికి వారు వెళ్లినా ఒకరు ఉదయం పూట సమయం ఉండి, ఉదయం పూట మోటారు పెట్టుకోవాలని అనుకుంటారు. ఒకవేళ ఉదయం పూట ఏదైనా పని ఉంటే, మధ్యాహ్నం పూట పొలం దగ్గరకు వెళ్లి

మోటారు పెట్టుకోవాలని అనుకుంటారు. ఒకవేళ ఎవరైనా పగలంతా ఏదైనా పని చేసుకున్నా, రాత్రిపూట వెళ్లి మోటరు పెట్టుకోవాలని అనుకుంటారు. కాబట్టి, మనం విద్యుత్‌ను ఏ సమయంలోనైనా అందుబాటులో ఉంచితే రైతు తన ఇష్టం వచ్చినప్పుడు వాడుకునే పద్ధతిలో ఉండాలనే ఆలోచనతోనే గౌరవ ముఖ్యమంత్రి గారు ఈ విషయంలో చాలా పట్టుదలతో ఉన్నారు. తప్పకుండా రైతాంగానికి 24గంటల విద్యుత్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కూడా అందించడానికి ఏర్పాట్లు పూర్తి చేశాము. ఈ పైలెట్ ప్రాజెక్టులో వచ్చిన చిన్న, చిన్న సమస్యలన్నింటినీ కూడా అధిగమించి మొత్తం అన్ని జిల్లాల్లో కూడా నిరంతర విద్యుత్‌ని రైతాంగానికి అందుబాటులో ఉంచుతాము.

**శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్ :–** అధ్యక్షా, ట్రాన్స్‌మిషన్ లాసెస్ తక్కువ చేసేందుకు గతంలో హెచ్‌విడిఎస్ స్కీంని కొన్ని గ్రామాల్లో, మండలాల్లో, నా నియోజకవర్గంలో మాచారెడ్డి మండలాల్లో ఇంప్లిమెంట్ చేయడం జరిగింది. అటువంటి కార్యక్రమాలు ప్రభుత్వం ఎంతవరకు చేసింది. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని, సదాశివనగర్ మండల కేంద్రంలో మిషన్ కాకతీయ కార్యక్రమంలో గౌరవ ముఖ్యమంత్రి గారు పాల్గొన్నప్పుడు 33/11 కెపాసిటీ గల 11 సబ్‌స్టేషన్స్ మరియు 132కెవి–1 మూడు మాసాల్లో ఏర్పాటు చేస్తామని అనౌన్స్ చేయడం జరిగింది. కానీ, మూడు సంవత్సరాలు గడిచినప్పటికీ ఈరోజు వరకు 132కెవిని ప్రారంభించనే ప్రారంభించలేదు, 33/11 సబ్‌స్టేషన్స్ కూడా కేవలం 5 మాత్రమే పూర్తయినాయి. గౌరవ ముఖ్యమంత్రి గారు చెప్పినప్పుడు ఎట్టి పరిస్థితుల్లో అమలు కావాలి. అప్పుడే మనమీద ప్రజలకు నమ్మకం ఏర్పడుతుంది.

**శ్రీ జి. జగదీష్ రెడ్డి :–** గౌరవ ముఖ్యమంత్రి గారు అక్కడికి వెళ్లినప్పుడు స్థానిక ప్రజాప్రతినిధులు వారికి రిప్రజెంటేషన్స్ ఇవ్వడం జరిగింది. అప్పుడు విద్యుత్ విషయంలో మీకు ఎటువంటి ఇబ్బంది లేదు. లో ఓల్టేజి సమస్య లేకుండా ఎన్ని సబ్‌స్టేషన్లు కావాలన్నా ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని గౌరవ ముఖ్యమంత్రి గారు చెప్పారు. ఆ విషయం మా దృష్టికి వచ్చిన వెంటనే మూడు సబ్‌స్టేషన్స్, తదుపరి మూడు సబ్‌స్టేషన్స్ ఏర్పాటు చేయడం జరిగింది. అవసరాన్ని బట్టి పెంచుకుంటూనే వస్తున్నాము. ఇక్కడ గౌరవ ముఖ్యమంత్రి గారు చెప్పారు అయినా చేయలేదనే సమస్య కాదు. లో ఓల్టేజి సమస్య లేకుండా సబ్‌స్టేషన్స్ ఎక్కడెక్కడ అవసరమనుకుంటే అక్కడ సబ్‌స్టేషన్స్ ఏర్పాటు చేస్తాము. అదే జిల్లాలో గౌరవ ముఖ్యమంత్రి గారు ఇంకోచోట కూడా ఏర్పాటు చేస్తామని చెప్పడం జరిగింది. అక్కడకి కూడా వెళ్లి ఇచ్చేసి వచ్చాము. ప్రజాప్రతినిధులు రాష్ట్రంలో ఎక్కడ అవసరం ఉందని చెప్పినా, అక్కడికి అధికారులు వెళుతున్నారు. అక్కడ ఉండే అవసరాలను బట్టి ఎప్పటికప్పుడు ఏర్పాటు చేస్తున్నారు.

నేను బాల్కొండ నియోజకవర్గానికి వెళ్లినప్పుడు సహజంగా స్థానిక సర్పంచ్ గారిని కొబ్బరికాయ కొట్టడానికి పిలవడం జరిగింది. పిలిచినప్పుడు నాకు అక్కడ ఒక విచిత్రమైన అనుభవం ఏర్పడింది. సర్పంచ్ గారు కాదు, ముందు సబ్‌స్టేషన్ కమిటీ ఛైర్మన్ గారు కొబ్బరికాయ కొడుతారని అన్నారు. అసలు ఇక్కడ సబ్‌స్టేషనే లేనప్పుడు కమిటీ ఛైర్మన్ గారు ఎక్కడుంటారని అడిగాను. లేదు, లేదు ఈ గ్రామంలో సబ్‌స్టేషన్ కావాలని గ్రామ ప్రజలంతా ఒక కమిటీ వేసుకొని సబ్‌స్టేషన్ కొరకు తిరుగుతున్నారు. అది ఇప్పుడు వచ్చింది కాబట్టి, అతనితో కొట్టించాలని అనడం జరిగింది.

అలా, అంతకుముందు సబ్‌స్టేషన్లు కావాలంటే కమిటీలు వేసుకొని సంవత్సరాల తరబడి సెక్రెటేరియేట్ చుట్టూ తిరుగుతుండేవారు. అంతకుముందు ప్రజాప్రతినిధులు ఎవరు వచ్చినా మాకు 2 సబ్‌స్టేషన్లు కావాలి, 3 సబ్‌స్టేషన్లు కావాలని వస్తుండేవారు. కానీ, ఇప్పుడు కనీసం 5 సబ్‌స్టేషన్లు కావాలి, 10 సబ్‌స్టేషన్లు కావాలని వస్తున్నారు. ఈ విషయాన్ని నేనేదో విమర్శ కొరకు చెప్పడం లేదు. కానీ, నిజంగా అక్కడ అవసరం ఉందనుకుంటే అక్కడికి మా అధికారులు వెళ్లి పరిశీలించి తప్పకుండా ఇస్తారు. నిజంగా కూడా ఎక్కడైనా లో ఓల్టేజి సమస్య వస్తుంది, నాణ్యత లేని కరెంట్ వస్తుందనుకుంటే వారు మా దృష్టికి తీసుకురావచ్చు హెచ్‌విడిఎస్ పద్ధతిని అంతటా కూడా అమలు చేయడానికి నిర్ణయం తీసుకున్నాము. దానిని విడతల వారీగా అమలు చేస్తున్నాము.

## తెలంగాణ ప్రెస్ అకాడమీ కొరకు కొత్త భవనం

**11.00 ఉ.** ప్రశ్న నెం.2340(49)

సర్వశ్రీ టి. భానుప్రసాద రావు, కర్నె ప్రభాకర్, సుంకరి రాజు, ఎం.ఎల్.సి.లు:– గౌరవనీయులైన ముఖ్యమంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

(అ) తెలంగాణ ప్రెస్ అకాడమీ కోసం ఒకకొత్త భవనాన్ని నిర్మించే ప్రతిపాదన ఏదైనా ఉన్నదా;

(ఆ) అయితే, ఆ వివరాలేమిటి;

(ఇ) ఎప్పటిలోగా పనులను ప్రారంభించి, పూర్తి చేయడమవుతుంది;

(ఈ) రాష్ట్రంలోని జర్నలిస్టుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలేమిటి?

ముఖ్యమంత్రిగారి తరపున రోడ్లు & భవనాల శాఖ మంత్రి (శ్రీ తుమ్మల నాగేశ్వరరావు):- (అ) అవునండీ.

(ఆ) రూ.15 కోట్ల మొత్తాన్ని మంజూరు చేసి, ఆమోదించిన డిజైన్ల ప్రకారం పనిని నిర్వహించడానికి ఇంజనీరు-ఇన్-చీఫ్‌కు (ఆర్&బి) విడుదల చేయడమయింది.

(ఇ) టెండర్లను ఖరారు చేసిన తరువాత భవన నిర్మాణాన్ని ప్రారంభించి ఒక సంవత్సర కాలం లోపల పూర్తి చేయడమవుతుంది.

(ఈ) జర్నలిస్టుల కోసం ప్రభుత్వం ఈ క్రింద వివరించిన సంక్షేమ చర్యలను చేపట్టింది :-

1. తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ నిధి
2. ఆరోగ్య కార్డులు
3. సాంఘిక భద్రతా పథకం (ప్రమాద బీమా)
4. గుర్తింపులు
5. ఉచిత బస్ పాసులు
6. రాయితీ రైల్వే పాసులు
7. కొత్త ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో వసతి

**శ్రీ టి. భానుప్రసాద రావు (స్థానికసంస్థలు - కరీంనగర్):-** అధ్యక్షా, ప్రెస్ అకాడమి కొరకు కొత్త భవనాన్ని నిర్మించే నిమిత్తం రూ.15 కోట్లు మంజూరు చేసి త్వరలోనే టెండర్‌లను పిలవబోతున్నందుకు ప్రభుత్వాన్ని నేను అభినందిస్తున్నాను. రాష్ట్రంలో ఉన్నటువంటి జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని వారికి ఆరోగ్య కార్డులు, జర్నలిస్టుల కొరకు ప్రత్యేకంగా ఒక సంక్షేమ నిధిని ఏర్పాటు చేయడమేగాక, వారికి బీమా సౌకర్యం కల్పించడానికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటున్నట్లు గౌరవ మంత్రిగారు చెప్పడం జరిగింది. నేను తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని కోరేదేమిటంటే, రాష్ట్రంలో ప్రింటు మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాలు రెండూ కూడా గ్రామంలో క్రింది స్థాయి నుంచి ప్రజలలోకి వెళ్లి చైతన్యం కలిగించడమే గాక, అనేక మంది జర్నలిస్టులు వివిధ స్థాయిలలో విధులు నిర్వర్తిసుంటారు.

అదేవిధంగా ప్రతి సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనేక వందల కోట్ల రూపాయలు ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియాలకి ప్రకటనల రూపంలో ఆదాయం సమకూర్చడం జరుగుతున్నది. చాలా మంది జర్నలిస్టులకి ఈరోజు జీతాలు సరిగ్గా అందని పరిస్థితి ఉన్నది. తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని కోరేదేమంటే, ఒకటి - ప్రభుత్వం జర్నలిస్టులకి కనీస వేతనాలను ఏర్పాటు చేయడం. రెండు - వారికి ఆయా సంస్థలు కనీస వేతనాలను చెలించనట్లయితే, ప్రభుత్వం నుంచి ఇచ్చేటటువంటి ప్రకటనలను ఆపడంగాని లేదా పూర్తిగా నిషేధించడంగాని చేయాలి. అదేవిధంగా జర్నలిస్టులకు రావలసిన వేతన బకాయిలు త్వరగా ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ కర్నె ప్రభాకర్:-** అధ్యక్షా, జర్నలిస్టులకి సంబంధించిన సంక్షేమంపైన మూడు సంవత్సరాలుగా ఆరోగ్య కార్డులు, జర్నలిస్టుల సంక్షేమ నిధి, సాంఘిక భద్రతా పథకం, గుర్తింపు కార్డులు ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నందుకు గౌరవ ముఖ్యమంత్రిగారికి మరియు సంబంధిత శాఖ మంత్రిగారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఇంకా అక్రెడిటేషన్ రాకుండా ఇబ్బంది పడుతున్న వారు కొంతమంది ఉన్నారు. అక్రెడిటేషన్ ఉండి కూడా ఆరోగ్య కార్డులు, సాంఘిక భద్రతా పథకాలు అందక కొంతమంది జర్నలిస్టులు ఇబ్బంది పడుతున్నారు.

ఈరోజు మనం సమావేశాలు నిర్వహించుకున్నా లేదా ఎవరైన రాజకీయ పార్టీలు సభలు పెట్టుకున్నా, మరుసటి రోజు దానికి సంబంధించిన వార్తలు పత్రికలలోగాని, టి.వి.లలోగాని రాకపోతే సభ జరిగినట్లే ఉండదు. కాబట్టి, ఇంత ప్రధాన భూమిక పోషిస్తున్న జర్నలిస్టుల విషయంలో తప్పకుండా ప్రభుత్వానికి బాధ్యత ఉంది, అందులో ఎటువంటి అనుమానం లేదు. ఇంతకుముందు గౌరవ సభ్యులు శ్రీ భానుప్రసాదరావు గారు చెప్పినట్లుగా జర్నలిస్టులకు ఖచ్చితంగా వచ్చేటటువంటి నెలసరి జీతం విషయంలో ఒక భద్రత ఉండవలసిన అవసరం ఉంది. వారు ఎండ, వాన అనేది లేకుండా అర్ధరాత్రి వేళల్లో కూడా కష్టపడతారు. వర్షాలు వస్తే వివిధ శాఖల అధికారులు ఎలాగైతే కష్టపడతారో, జర్నలిస్టులు కూడా ఆ విధంగా కష్టపడతారు. అటువంటి వారికోసం

తప్పకుండా ప్రభుత్వం నుంచి ఒక భద్రత కల్పించవలసిన అవసరముంది.

రెండవది – ఇంతకుముందు గౌరవ మంత్రిగారు జర్నలిస్టుల కొరకు ఒక చక్కటి బిల్డింగును డిజైన్ చేస్తామని చెప్పారు. నేను తమరి ద్వారా అడుగుతున్నాను. ఇవ్వాళ ప్రభుత్వం కళాభవన్ తోపాటు మిగతా భవనాలు ఏర్పాటు చేస్తున్నది. ఈ మధ్యకాలంలో నేను ప్రెస్ అకాడమి ఛైర్మన్ ఆఫీసుకి వెళ్లడం జరిగింది. అక్కడ వారి ఆఫీసు చాలా చిన్న డిక్కీలాగా ఉన్నది. వారి మెంబర్లు దాదాపు పది మంది వరకు ఉన్నారు. వారు చిన్న చిన్న గదులలో విధులు నిర్వహించుకుంటున్నారు. కాబట్టి జర్నలిస్టులకు ఎక్కువ స్థలం కేటాయించి, పార్కింగ్‌కి ఎటువంటి ఇబ్బంది లేకుండా ఒక చక్కటి భవనాన్ని నిర్మించవలసిందిగా తమరి ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

**శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్:–** అధ్యక్షా, ఈ ఇష్యూ I&PR కి సంబంధించింది కాబట్టి, నేను చెప్పేదేమంటే, టీ విరామంలోనైనా మీడియా సోదరులను పిలిపించి, వారి సమస్యల గురించి యాజమాన్యంతో మాట్లాడితే బాగుంటుంది. సభలో ప్రజలకు ఉపయోగపడే విధంగా మంచి చర్చలు జరుగుతున్నాయి. ఆ చర్చల వివరాలను అటు అసెంబ్లీతోపాటు, ఇటు కౌన్సిల్ చర్చలను కూడా ఎక్కువగా కవరేజ్ చేసి ప్రజలలోకి తీసుకు వెళ్లాలని హౌజ్ తరఫున నేను అప్పీల్ చేస్తున్నాను.

**శ్రీ తుమ్మల నాగేశ్వర రావు:–** అధ్యక్షా, భారతదేశంలోనే మొట్టమొదటగా తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల యొక్క సంక్షేమ నిధి కొరకు గౌరవ ముఖ్యమంత్రిగారు రూ.100 కోట్లు అనౌన్స్ చేయడం జరిగింది. ఇప్పటికే రూ.30 కోట్లు విడుదల చేశాం. ఈ బడ్జెట్‌లో కూడా మిగిలిన రూ.30 కోట్లు విడుదల చేస్తామని గౌరవ సభ్యులకు మనవి చేస్తున్నాను. జర్నలిస్టుల సంక్షేమ నిధి విషయంలో వారు ఒకవేళ దురదృష్టవశాత్తు చనిపోతే రూ.1.00 లక్ష, అలాగే ప్రమాదాల వల్ల గాని, శాశ్వత అంగవైకల్యం ఏర్పడితే రూ.50,000 ఇవ్వడం జరుగుతోంది. 5 సంవత్సరాలపాటు నెలకు రూ.3,000/–ల చొప్పున పెన్షను కూడా ఇవ్వడం జరుగుతుంది.

జర్నలిస్టుల సంక్షేమ కార్యక్రమాలు ఇప్పటి వరకు 135 జర్నలిస్టుల కుటుంబాలకు అమలు చేయడం జరిగింది. అలాగే 30,364 మంది జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యులతో సహా ఆరోగ్య కార్డుల ద్వారా వైద్య చికిత్సను పొందారు. సామాజిక భద్రత పథకం క్రింద వర్కింగ్ జర్నలిస్టుల ప్రమాద బీమా సౌకర్యం రూ.5.00 లక్షలు కల్పించడం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా 31 జిల్లాలలో ఉన్న వర్కింగ్ జర్నలిస్టులందరికీ ప్రభుత్వ సమాచార సేకరణను సులభతరం చేయడం కోసం 15,607 అక్రెడిటేషన్ కార్డులు కూడా అందజేయడం జరిగింది. వీటి కాల పరిమితి 31.12.2018 వరకు ఉన్నది.

అదేవిధంగా జర్నలిస్టులకు ఉచిత బస్ పాస్ సౌకర్యం కల్పించాం. సమాచార శాఖచే జారీ చేయబడిన అనుబంధ గుర్తింపు జర్నలిస్టులకు కూడా దేశ వ్యాప్తంగా ప్రయాణించడానికి రైల్వే శాఖ ద్వారా 50 శాతం రాయితీ పాసులు ఇప్పించడం జరిగింది. రాష్ట్రంలో అక్రెడిటేషన్ పొందిన జర్నలిస్టులందరికీ న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో రాయితీ కూడా ఇవ్వడానికి సంకల్పించాం.

గౌరవ సభ్యులు శ్రీ టి. భానుప్రసాదరావు గారు అడిగిన దానికి, రెగ్యులర్ జర్నలిస్టులు ఎవరైతే ఉన్నారో, వారికి ఇప్పటికే కనీస వేతనాలు ఉన్నాయి. వాటిని అమలు చేయవలసిన బాధ్యత వేజ్ బోర్డు కమిటీకి ఉంది. అది పరిశీలిస్తాం. స్ట్రింగర్స్‌కు గాని, కాంట్రిబ్యూటర్స్‌కు గాని కనీస వేతనం వర్తించదు. ఆ విషయాన్ని గౌరవ సభ్యులు అర్థం చేసుకోవలసిన అవసరముంది. ప్రెస్ అకాడమికి ఇప్పుడు వసతి సౌకర్యం లేనందునే కొత్త బిల్డింగులు ప్రతిపాదించడం జరిగింది. మంచి డిజైన్‌తోపాటు మంచి పార్కింగ్‌తో సహా అన్ని సౌకర్యాలతో భవనాన్ని ఏర్పాటు చేస్తాము.

గౌరవ సభ్యులు శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్ గారు సరిగా కవరేజ్ రావడం లేదని అన్నారు. మేము అసెంబ్లీలో ఇచ్చిన సమాధానం కంటే, ఇక్కడ మంచి సమాధానం ఇస్తున్నాం. మాకు కూడా గుర్తింపు రావడం లేదు. జర్నలిస్టు సోదరులు ఈ చర్చలు వింటున్నారు కాబట్టి పెద్దల సభను వారు గౌరవించి, ఇంత ప్రశాంతంగా, ఇంత మంచి పద్ధతుల్లో చర్చ జరుగుతున్నప్పుడు వారు కూడా మాకు మంచి కవరేజ్ ఇస్తే, సభ్యులు మరింత ఎక్కువగా చర్చలో పాల్గొనే అవకాశం ఉంటుంది. గౌరవ ఛైర్మన్ గారు కూడా ఆ విషయాన్ని జర్నలిస్టుల దగ్గరకు తీసుకెళితే బాగుంటుంది. ప్రభుత్వం కూడా అదే ఆలోచనలో ఉంది కాబట్టి, దానిని పరిశీలించమని గౌరవ సభ్యులు కోరుతున్నారు.

**శ్రీ ఫారూఖ్ హుసేన్:–** అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీ భానుప్రసాదరావు గారు చెప్పినట్లు మండల స్థాయి విలేఖర్లు వార్తలు సేకరిస్తున్నారు కానీ, వారు నడిపే వాహనాలలో పెట్రోల్ పోయించుకోవడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. కాబట్టి

వారి సంక్షేమం గురించి ఆలోచించవలసిన అవసరమున్నది. రెండవది – తెలుగు, ఇంగ్లీషులో ప్రకటనలు వస్తుంటాయి గాని ఉర్దూ ప్రకటనలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. కాబట్టి ఉర్దూలో కూడా సమాన హక్కు కల్పించాలి. ఎందుకంటే గౌరవ ముఖ్యమంత్రిగారు ఉర్దూ భాషను సెకండ్ లాంగ్వేజ్‌గా డిక్లేర్ చేశారు. మూడవది – ఉర్దూ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు ఇచ్చే విషయంలో దృష్టి పెట్టవలసిందిగా తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ తుమ్మల నాగేశ్వర రావు:–** అధ్యక్షా, జర్నలిజం అనేది ఒక passion. చదువుకున్న యువకులు వార్తలను సేకరించడం, ఆ సంస్థలలో పని చేయాలనే ఒక కోరిక, ఇది ఒక రకమైన ప్రజా సేవే అధ్యక్షా. ప్రజా ప్రతినిధులుగా ప్రభుత్వం చేసే కార్యక్రమాలని, ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం, ప్రభుత్వం చేసే కార్యక్రమాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లడం, అది కష్టమైనా, పెట్రోల్ లేకపోయినా, అదొక passionతో చేస్తున్నారు. వారిని గౌరవించవలసిన అవసరముంది. వారియొక్క ఆర్థిక పరిస్థితులను కూడా గమనంలోకి తీసుకోవలసినటువంటి అవసరముంది.

అదేవిధంగా మండల స్థాయి రిపోర్టర్‌లకు కూడా అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వమని చెప్పారు. అది కూడా పరిశీలిస్తాము. గౌరవ సభ్యులు శ్రీ భానుప్రసాదరావు గారు చెప్పినట్లు, శ్రీ అల్లం నారాయణ గారు సంపూర్ణమైన విషయ పరిజ్ఞానం కలిగిన వ్యక్తి ప్రెస్ అకాడమీకి ఛైర్మన్‌గా ఉన్నారు కాబట్టి జర్నలిస్టుల జీతాలకు సంబంధించిన అంశాలపై వారిని సంప్రదించి తగు చర్యలు తీసుకుంటామని గౌరవ సభ్యులకు మనవి చేస్తున్నాను.

## నియోజక వర్గ అభివృద్ధి పనుల కొరకు గ్రామ సభ తీర్మానాలు

ప్రశ్న నెం.2220(50)

శ్రీమతి ఆకుల లలిత, ఎం.ఎల్.సి.:– గౌరవనీయులైన పంచాయతీ రాజ్ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

(అ) కొంతమంది శాసన పరిషత్తు సభ్యులు వారి నియోజవర్గపు నిధుల నుండి ప్రతిపాదించిన పనులపై గ్రామసభలు తీర్మానాలను జారీ చేయలేదన్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందా;

(ఆ) అయితే, అందుకు గల కారణాలేమిటి;

(ఇ) అవసరమయ్యే తీర్మానాలు లేనందున అభివృద్ధి పనులు తగ్గిపోతున్న విషయం వాస్తవమేనా;

(ఈ) అయితే, ఇందుకు సంబంధించి తీసుకున్న చర్యలేమిటి?

పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి (శ్రీ జూపల్లి కృష్ణారావు):– (అ) లేదండీ.

(ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

(ఇ) లేదండీ.

(ఈ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

**శ్రీమతి ఆకుల లలిత:–** అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రిగారు అందరికీ సమానంగా రూ.3.00 కోట్లు సిడిఎఫ్ క్రింద ఇచ్చారు. గౌరవ సభ్యులందరూ కూడా బంగారు తెలంగాణ కావాలని అంటున్నారు. గ్రామాలను అభివృద్ధి చేసేందుకు మేము నిధులు మంజూరు చేసినప్పటికీ ఆయా పనులపై గ్రామ సభలు తీర్మానాలను చేయకుండా అక్కడ ఉండే కొందరు రాజకీయ నాయకులు, స్థానిక శాసన సభ్యులు, ఎంపిపిలు, అధికారులు అడ్డుకుంటున్నారు. 2015–16 సంవత్సరంలో నేను ప్రతిపాదించిన పనులన్నీ జరుగకుండా అలాగే ఉన్నాయి. కాబట్టి ఆ విషయంలో తగు చర్యలు తీసుకోవాలని తమరి ద్వారా గౌరవ మంత్రిగారికి తెలియజేస్తున్నాను.

**శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి:–** అధ్యక్షా, గౌరవ సభ్యురాలు శ్రీమతి ఆకుల లలిత గారు చెప్పిన కాన్సెప్ట్ వాస్తవం. ఎంఎల్‌సిలకు సరైన గౌరవం ఉండటం లేదు. జి.ఓ.లో ఎంపి, ఎంఎల్‌సి, ఎంఎల్ఏలు అని ఉంటుంది. ఎంఎల్ఏలు కొన్ని చోట్ల అభ్యంతరం పెడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. కాబట్టి, దయచేసి ఈ హౌజ్ యొక్క గౌరవంతోపాటు సభ్యుల యొక్క గౌరవాన్ని కూడా కాపాడాలని మా సభ్యురాలి ఉద్దేశ్యం. సిడిఎఫ్ విషయంలో రాజ్యసభ, లోకసభలో కూడా చాలా వరకు అలాగే ఉంటుంది. అంతకుముందు పాఠశాలలకు ఇవ్వడం జరిగింది. తర్వాత హరితహారం కార్యక్రమానికి కూడా మా ఫండ్ నుంచి నిధులు ఇస్తున్నాం. అందుకోసం ఎంఎల్ఏ, సర్పంచ్‌లకు అప్లికేషన్ పెట్టుకొని ఇవ్వాలంటే ఇబ్బందవుతుంది. వాళ్లు గౌరవప్రదంగా ట్రీట్ చేయాలనేదే సభ్యురాలి యొక్క ఆవేదన. ఆ రకంగా మా రెస్క్యూకి వచ్చి, మా గౌరవానికి ఎటువంటి ఇబ్బంది కలుగకుండా, సజావుగా సాగేటట్లు చూడాలని తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ జూపల్లి కృష్ణారావు:–** అధ్యక్షా, ఎంఎల్ఏలు, ఎంపిలు, ఎంఎల్సిల నియోజకవర్గాల అభివృద్ధి కొరకు ఇచ్చినటువంటి డెవలప్‌మెంట్ నిధులతోపాటు ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్లు కూడా మంజూరు చేస్తున్నది. పనులు వేగంగా జరుగుతున్నాయి. గౌరవ శాసన పరిషత్తు సభ్యులు శ్రీ బోడకుంటి వెంకటేశ్వర్లు, శ్రీ కసిరెడ్డి నారాయణ రెడ్డి, శ్రీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి ఇంకా అనేక మంది గౌరవ సభ్యులు ఇచ్చినటువంటి నిధులతోపాటుగా ఈ మధ్యకాలంలో వచ్చిన ఎన్ఆర్ఇజిఎస్ వారికి ఇచ్చిన సిసి రోడ్డులకు కేటాయించిన నిధులను కూడా ఖర్చు పెట్టడం జరిగింది. వాటి పనులు కూడా జరుగుతున్నాయి.

గౌరవ సభ్యులు చెప్పిన విషయం ఏమిటంటే, వారి నియోజక వర్గంలోని భీమ్‌గల్, మాలిక్‌బండారు అనే గ్రామాలకు సంబంధించిన అంశాన్ని వారు ప్రస్తావించారు. నామినేషన్ పైన ఇచ్చే పనులు గ్రామ పంచాయతీకి ఇవ్వడం లేదనేది వారి ప్రస్తావనలోని ప్రధాన అంశం. గ్రామ పంచాయతీలనేవి వాటికి ఉన్నటువంటి అధికారాలు, విధుల ప్రకారం చేస్తుందే తప్ప దానికోసం ప్రభుత్వం ఫలానా వారికి ఇవ్వాలని చెప్పేటటువంటి పరిస్థితి లేదు. గతంలో గ్రామ పంచాయతీలు వారియొక్క వనరులను బట్టి పనులను అప్పగించడం జరిగేది. ఇందులో ప్రభుత్వం యొక్క ప్రమేయం ఏమీ ఉండదు.

**మిస్టర్ ఛైర్మన్:–** ప్రశ్నోత్తరాలు ముగిసినట్లుగా గౌరవ సభ్యులు గమనించవలసిందిగా కోరుతున్నాను.

## II. సభా కార్యక్రమం

## 1. వాయిదా తీర్మానం

హైదరాబాద్‌లోని అనేక ముఖ్యమైన రోడ్లు పాడై, గుంతలమయమై మరియు ప్రమాదాలకు కారణమవుతూ, వాహనదారులకు ఎంతో ఇబ్బంది కలిగిస్తున్న అంశంపై సభను వాయిదా వేసి వెంటనే చర్చించాలని శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్ గారు మరియు ఇతరులు ఇచ్చినటువంటి వాయిదా ప్రతిపాదనను తిరస్కరించడమైనది.

## 2. ప్రత్యేక ప్రస్తావనలు

a) **శ్రీ కర్నె ప్రభాకర్:–** అధ్యక్షా, ఉమ్మడి రాష్ట్రంలో చేనేత రంగ కార్మికుల పరిస్థితులు రోజురోజుకి దిన, దిన గండంగా గడిచేది. అసలు చేనేత రంగాన్ని ఎంచుకోవడం అంటేనే మెడకు ఉరితాడులాగా భావించినటువంటి పరిస్థితులు ఉండేవి. అలా పక్కకే తేజాబ్‌ని పెట్టుకొని బ్రతుకుతున్నటువంటి చేనేత కార్మికులకు అండగా ఉండాలని, వారిని ఆదుకోవాలనే ఆలోచనతో అనేక రకాలుగా యార్న్, రంగులపైన సబ్సిడీలు ఇవ్వాలని ఈమధ్యనే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినందుకు గౌరవ ముఖ్యమంత్రి గారికి మరియు సంబంధిత మంత్రివర్యులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

సిరిసిల్లతోపాటు భువనగిరి మరియు మునుగోడు నియోజకవర్గాలలో కూడా చేనేత కార్మికులున్నారు. యార్న్‌లో 40 శాతం మరియు థ్రిఫ్ట్‌లోను 16 శాతం సబ్సిడీ వాళ్లకు వస్తుంది. అయితే జియో ట్యాగింగ్ అనేది దాదాపు ఇంకొక 22 శాతం నుండి 25 శాతం మిగిలిపోయిందని చేనేత కార్మికులు చెబుతున్నారు. కాబట్టి, తిరిగి జియో ట్యాగింగ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం నూలుపై జిఎస్‌టి విధిస్తోంది. దానిని కూడా తొలగించే విధంగా చర్యలు తీసుకోవలసిందిగా తమరి ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అలాగే 2010 నుండి ఇప్పటివరకు ఏవైతే వ్యక్తిగత ఋణాలున్నాయో వాటిని రద్దు చేయాల్సిందిగా తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను. వ్యక్తిగత ఋణాల క్రింద లక్షరూపాయలు ఇచ్చేటటువంటి 'ముద్ర' లోన్స్ ఏవైతే ఉన్నాయో వాటిని కూడా ఇప్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తమరి ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అధ్యక్షా, చేనేత కార్మికుల కష్టాలు తెలిసిన వ్యక్తిగా, గతంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగారు ఉద్యమకారుడిగా ఉన్నటువంటి సందర్భంలో పోచంపల్లిలో భిక్షం ఎత్తుకొంటున్న దాదాపు 6, 7 మంది చేనేత కార్మికులని కాపాడుకున్న సందర్భాలున్నాయి. కాబట్టి, గీత కార్మికులు చనిపోయినప్పుడు వారికి నష్టపరిహారంగా ఏవిధంగానైతే రూ.5.00 లక్షలు చెల్లిస్తున్నారో, అదేవిధంగా చేనేత కార్మికులు చనిపోతే వారికి కూడా రూ.5.00 లక్షలు చెల్లిస్తే, వారికి మనం భరోసా ఇచ్చిన వారమవుతాం. కాబట్టి ఈ అంశాలన్నింటిపైన సరైన నిర్ణయం తీసుకొని, ఆ వర్గాలను కాపాడవలసిందిగా తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ కె. తారక రామారావు :–** అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీ కర్నె ప్రభాకర్ గారు చేనేత కార్మికుల స్థితిగతులపై

ప్రస్తావించిన అంశాలన్నింటినీ కూడా పరిశీలించడం జరుగుతుంది.

(ప్రత్యేక ప్రస్తావనను అందజేయడం జరిగింది.)

**శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్:–** హౌజ్ యొక్క గౌరవం మరియు సంప్రదాయాల విషయం గురించి తమరి అనుమతితో చెప్పదలచుకున్నాను. ఇప్పటివరకు సభలో ఏ సబ్జెక్టు ఎప్పుడు తీసుకుంటున్నారో అర్థం కావడం లేదు. ప్రశ్నోత్తరాల వివరాలు కూడా రాత్రి 11.00 గంటల తర్వాత ఇస్తున్నారు. ఉదాహరణకు ఇంటర్‌నెట్‌లో చూస్తే ఆర్&బికి సంబంధించింది అని మాత్రం ఉంటుంది. అందులో ఏమి ఉన్నదనేది క్వశ్చన్ అండ్ ఆన్సర్ పేపర్లను చదివితేనే తెలుస్తుంది. నెట్‌లో మాత్రం ఎటువంటి వివరాలు ఉండటం లేదు. క్వశ్చన్ ఉందని తెలుస్తుంది కానీ, గౌరవ సభ్యులు ఏ అంశం గురించి అడిగారనేది మాత్రం తెలియడం లేదు.

మరొక విషయం ఏమిటంటే, బిజినెస్ అడ్వైజరీ కమిటీ నిర్ణయించిన ప్రకారం, ఛైర్మన్ గారికి అధికారం ఉంటుంది కాబట్టి, ఏదైనా ప్రత్యేక పరిస్థితుల్లో ఆ అధికారాన్ని ఉపయోగించవచ్చు. దానికి ఎవరూ కాదనడం లేదు. మన గవర్నర్‌గారి తల్లిగారు చనిపోయారని తెలిస్తే, మేము వారి ఇంటికి వెళ్లి పరామర్శించి వచ్చాము. ఈరోజు క్వశ్చన్ అవర్ తరువాత సభను వాయిదా వేసి తమరితోపాటు గౌరవ సభ్యులందరూ వారి ఇంటికి వెళ్లేందుకు నిర్ణయం తీసుకున్నారని తెలిసింది. అందుకు మాకు ఎటువంటి అభ్యంతరం లేదు. మన హౌజ్ సంప్రదాయం ఏమిటంటే, బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించినప్పుడు లేదా ఎమర్జెన్సీగా ఉన్నప్పుడు ఫ్లోర్ లీడర్స్‌కి ఫోన్ చేసి, ఈ విషయంలో తొందరగా నిర్ణయం తీసుకోవలసి ఉంది, మీ అభిప్రాయం ఏమిటని consensus తీసుకున్న తరువాతే ఛైర్మన్‌గారు ఇక్కడికి వచ్చి ప్రకటిస్తారు. నేను 1989 సంవత్సరం నుండీ ఉభయ సభలలో సభ్యునిగా ఉంటున్నాను.

**మిస్టర్ ఛైర్మన్:–** శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్ గారికి, ఇక్కడ ఉన్నటువంటి విప్‌లకు, మిగతా అన్ని పార్టీల నాయకులకు విజ్ఞప్తి చేసేదేమంటే, వారు చెప్పినట్లుగా... వారి ప్రశ్నకే వారు సమయానికి అందుకోలేదు. బహుశా, ఆ విషయం మరచిపోయి గౌరవ ఎల్‌ఓపి గారు మాట్లాడుతున్నారు. ఆల్‌రెడీ ప్రక్కన ఉన్నటువంటి భారతీయ జనతా పార్టీ, ఎంఐఎం, టిఆర్ఎస్ మరియు ఉపాధ్యాయ సంఘ నాయకులతో పాటు వారిని కూడా పిలవడం జరిగింది. కానీ, వారు సమయానికి రాలేదు.

నేను నా రూములోకి పిలిచి పరిస్థితి ఈ విధంగా ఉంది, క్వశ్చన్ అవర్ తరువాత మనం సమయం తీసుకొని పోవలసి ఉంటుంది, ఆయన మన రాష్ట్రానికి పెద్ద, ప్రత్యేకంగా ఆహ్వానం పంపారని, నేను ప్రతి ఒక్కరికి చెప్పడం జరిగింది. గౌరవ సభ్యులు పొంగులేటి సుధాకర్ రెడ్డి గారు కూడా ఆలస్యంగా వస్తే, వారికి చిట్టీ ద్వారా మెసేజ్ పంపడం జరిగింది. గౌరవ ఎల్‌ఓపి గారు క్వశ్చన్‌కే ఆలస్యంగా వచ్చారు కాబట్టి వారికి సమాచారం లేదు. వారికి సమాచారం లేక సభను తప్పు పట్టడం న్యాయం కాదు. దయచేసి నేను అందరిని పిలిచి మాట్లాడిన విషయాన్ని వారు గమనించాలని కోరుతున్నాను.

11.20 ఉ. (b) **శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి (ఉపాధ్యాయ నియోజకవర్గం – మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ మరియు కరీంనగర్):–** అధ్యక్షా, మన రాష్ట్రంలోని విద్యా విధానంలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకొస్తున్నాం. దానిలో భాగంగా నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేయడమైనది. 2009వ సంవత్సరంలో సుప్రీంకోర్టు జడ్జిమెంట్‌కి అనుగుణంగా, జీ.ఓ.ఎం.ఎస్.నెం.19 ప్రకారం ప్రతి హైస్కూల్‌లో ఒక సైకాలజిస్ట్‌ను ఏర్పాటు చేయాలని ఉంది. వారి సేవలు వినియోగించుకోవాలి. కేవలం మనం కంటెంట్‌కే పరిమితమైనాము. టీచింగ్ మెథడాలజీలో ఇదే ప్రధాన సబ్జెక్ట్ కాబట్టి, సైకాలజిస్టులను నియమించే అవకాశం మన రాష్ట్ర ప్రభుత్వ పరిశీలనలో ఉన్నదా? దాని గురించి ఆలోచించవలసిందిగా తమరి ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

**శ్రీ కడియం శ్రీహరి:** అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డిగారు తెలిపిన విషయాలను నోట్ చేసుకోవడం జరిగింది.

(ప్రత్యేక ప్రస్తావనను అందజేయడం జరిగింది.)

**మిస్టర్ ఛైర్మన్:–** 3వ తేది నవంబరు, 2017 శుక్రవారం ఉ.10.00గం.లకు సమావేశం అయ్యేందుకు సభను వాయిదా వేయడమైనది.

(Then the House is adjourned at 11.25 A.M. to meet again at 10.00 A.M. on 3rd November, 2017.)

☺☺☺

**“Published under Rule 316 of the Rules of Procedure and Conduct of Business in the Telangana Legislative Council and Printed at the Assembly Press, Public Gardens, Hyderabad.”**